http://www.agnidharanews.com

# అగ్నిధార

బుధవారం 15 ఏప్రిల్ 2026

నిజాల నిప్పు కణిక

పేజీలు : 5 వెల : 5/-

Published from Peddapalli Ciculated by Hyderabad, , , Sangareddy, jagityala, Rangareddy, Khammam,Medchal Medak Siddipet, Nalgonda, , warangal, Nizamabad

## విలేకరులు కావలెను

ప్రజా గళాన్ని బలంగా వినిపిస్తూ.. అవినీతిపై సమరాన్ని సాగిస్తున్న అగ్నిధార తెలుగు దినపత్రికలో పనిచేయుటకు అనుభవం, ఆసక్తి గల వారికి అవకాశం కలదు. అన్ని జిల్లాలు, డివిజన్లు, మున్సిపల్ మరియు మండల కేంద్రాల్లో విలేకరులు కావలెను.

ఆసక్తి కలిగినవారు సంప్రదించగలరు

సెల్ : 80088 17828




## బిహార్ కొత్త ముఖ్యమంత్రిగా సమ్రాట్ చౌధరీ

- బీజేపీ తొలి సీఎంగా రికార్డ్
- బిహార్‌లో బీజేపీ శాసనసభా పక్ష నేతగా ఎంపికైన సమ్రాట్ చౌధరీ
- నూతన ముఖ్యమంత్రిగా బాధ్యతలు
- బుధవారం లోక్‌భవన్‌లో సీఎంగా బాధ్యతలు చేపట్టనున్నట్లుగా సమాచారం.

### తెలంగాణ రాష్ట్రానికి

# తీరని నష్టం

- నియోజకవర్గాల పునర్విభజన విషయంలో బీజేపీ కుట్రలు చేస్తోంది
- అంబేద్కర్ జయంతి వేడుకల్లో పాల్గొన్న సీఎం రేవంత్ రెడ్డి
- నియోజకవర్గాల పునర్విభజన విషయంలో బీజేపీ కుట్రలు చేస్తోందని విమర్శ
- ప్రధాని మోదీకి లేఖ రాసిన రేవంత్ రెడ్డి
- గాంధీ, అంబేద్కర్ దేశానికి రెండు కళ్ల లాంటివారు



హైదరాబాద్

రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా ప్రజాపాలన సాగిస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. లోయర్ ట్యాంక్ బండ్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి రేవంత్ రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. ముఖ్యమంత్రితో పాటు మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్, సీతక్క, తదితర నేతలు పాల్గొన్నారు. అనంతరం ప్రభుత్వాధ్వర్యంలో నిర్వహించిన అంబేద్కర్ జయంతి వేడుకల్లో పాల్గొన్నారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో అంబేద్కర్ జయంతి ఉత్సవాలు నిర్వహించారు. అనంతరం ప్రసంగించారు. పదేళ్ల విధ్వంసం వందేళ్ల నష్టానికి దారి తీసిందని విమర్శించారు. గతంలో చేసిన అప్పులు చెల్లిస్తూ తప్పులు సరిదిద్దుతూ పాలన సాగిస్తున్నామని అన్నారు. గత సర్కారు పాలనతో - మిగతా3లో



### ఆర్టీసీ కార్మికులు సమ్మె నిర్ణయం

# వెనక్కి తీసుకోవాలి

- మంత్రి ప్రభాకర్
- ఈ నెల 22 నుంచి సమ్మెకు వెళ్తున్నట్లు ఆర్టీసీ జేఏసీ ప్రకటన
- స్పందించిన రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్
- ఆర్టీసీ కార్మికులు సమ్మె నిర్ణయం వెనక్కి తీసుకోవాలని కోరిన మంత్రి

హైదరాబాద్

తెలంగాణ ఆర్టీసీలో సమ్మె సైరన్ మోగిన విషయం తెలిసిందే. ఈ నెల 22 నుంచి సమ్మెకు వెళ్తున్నట్లు ఆర్టీసీ జేఏసీ ప్రకటనపై రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పందించారు. బీఆర్ఎస్ పార్టీకి అనుబంధంగా ఉన్న ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగులు సమ్మెను ప్రేరేపిస్తున్నారని, వారి ప్రలోభాలకు గురికావొద్దని మంత్రి హితవు పలికారు. ఆర్టీసీ ఉద్యోగులకు ఎలాంటి సమస్యలు ఉన్నా తనను నేరుగా కలవొచ్చని స్పష్టం చేశారు. - మిగతా3లో



## ఛత్తీస్‌గఢ్ పవర్‌ప్లాంట్‌లో బాయిలర్ పేలుడు..

- 10 మంది మృతి.. 40 మందికి గాయాలు
- ప్రమాద స్థలంలో శిథిలాల కింద మరికొందరు కార్మికులు చిక్కుకుని ఉన్నట్లు అనుమానం
- ఈ ఘటనపై దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన ఛత్తీస్‌గఢ్ సీఎం విష్ణుదేవ్ సాయ్

### రాజ్యాంగాన్ని బీజేపీ, ఆరెస్సెస్


## ఆలోచనలు ధ్వంసం చేస్తున్నాయి

- కాషాయ పార్టీ ఓట్ల దొంగతనానికి పాల్పడుతోంది
- బీజేపీ ప్రజాస్వామ్యాన్ని నాశనం చేస్తోంది
- బంగాల్‌లో బీజేపీ ఓటు చోరీ చేసేందుకు మమతా ప్రభుత్వమే అవకాశం ఇచ్చింది
- రాహుల్ గాంధీ ఆరోపణలు



# తెలంగాణలో నిప్పుల వర్షం

- ఆ జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్.. రాష్ట్రంలో మండుతున్న ఎండలు
- ఉదయం 9 గంటల నుంచే భానుడి భగభగలు
- రాష్ట్రంలో 42 డిగ్రీలకు పైగా నమోదవుతున్న గరిష్ఠ ఉష్ణోగ్రతలు
- పలు జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలు జారీ



హైదరాబాద్

తెలంగాణ రాష్ట్రంలో ఎండల తీవ్రత కొనసాగుతోంది. పగటి పూట ఉష్ణోగ్రతలు రోజురోజుకూ పెరగుతున్నాయి. ఉదయం 9 గంటల నుంచే భానుడు నిప్పులు కురిపిస్తున్నారు. రాష్ట్రంలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 42 డిగ్రీలకు పైగా నమోదవుతున్నాయి. నిన్న ఉమ్మడి నిజామాబాద్‌లో 42.4, ఆదిలాబాద్‌లో 42.3 ఉష్ణోగ్రతలు, ఉమ్మడి మహబూబ్‌నగర్‌లో 41, ఖమ్మంలో 40.4 ఉష్ణోగ్రతలు, హైదరాబాద్‌లో 40.1 గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఒకవైపు ఎండ తీవ్రత మరోవైపు ఉక్కపోతతో జనం అల్లాడిపోతున్నారు. ఇవాళ ఉమ్మడి ఆదిలాబాద్, మహబూబ్‌నగర్, నిజామాబాద్, జగిత్యాల, సిరిసిల్ల, హైదరాబాద్ జిల్లాలకు వాతావరణశాఖ అధికారులు - మిగతా3లో



## 850కి లోక్‌సభ స్థానాలు

- డీలిమిటేషన్ కమిషన్ ఏర్పాటు
- మహిళా రిజర్వేషన్ల అమలుకు కేంద్రం సిద్ధం
- దేశంలోని చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు
- 2011 జనాభా లెక్కల ప్రకారమే లోక్‌సభ సీట్ల పెంచాలని బిల్లులో ప్రతిపాదించిన కేంద్రం
- ఈనెల 16న లోక్‌సభలో ప్రవేశపెట్టనున్న కేంద్రం

### ఆర్థికవృద్ధి ప్రకారం చట్టసభల్లో

# సీట్లు పెంచే విధానం ఎక్కడా లేదు



- ఆర్థికవృద్ధి సూచీ ప్రకారం వెళ్తే ఆదిలాబాద్, మహబూబ్‌నగర్‌లో అసెంబ్లీ సీట్లు తగ్గుతాయి
- అబద్ధాలు మాట్లాడి ప్రజలను తప్పుదోవ పట్టించొద్దని సీఎం రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి
- ఈసారి జనగణన, కులగణన పూర్తి కావడానికి సమయం ఎక్కువ పడుతుంది
- కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి

హైదరాబాద్

జనాభా ప్రకారం నియోజకవర్గాల పునర్విభజన చేస్తే దక్షిణాదికి నష్టమనే భావించే ప్రధాని మోదీ కొత్త ప్రతిపాదన చేశారని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. గతంలో ఉత్తరాది రాష్ట్రాలకు ఎక్కువ సీట్లు కేటాయించింది కాంగ్రెస్ పార్టీ కాదా అని ప్రశ్నించారు. ఆర్థికవృద్ధి సూచీ ప్రకారం చట్టసభల్లో సీట్లు పెంచే విధానం ప్రపంచంలో ఎక్కడా లేదని అన్నారు. రాష్ట్రంలో అసెంబ్లీ సీట్ల పెంపులో ఆర్థికవృద్ధి సూచీ విధానాన్నే పాటిస్తారా అని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఒకవేళా తెలంగాణలో ఆర్థికవృద్ధి సూచీ ప్రకారం వెళ్తే ఉమ్మడి ఆదిలాబాద్, మహబూబ్‌నగర్ జిల్లాల్లో అసెంబ్లీ సీట్లు తగ్గుతాయని జోస్యం - మిగతా3లో



## ఆర్టికల్ 370 రద్దు తర్వాత పూర్తిగా అమల్లోకి రాజ్యాంగం

- డెహ్రాడూన్ పర్యటనలో ప్రధాని మోదీ
- దిల్లీ, డెహ్రాడూన్ ఎకనామిక్ కారిడార్ ప్రారంభం
- చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు అమల్లో జాప్యం జరగడానికి వీల్లేదు
- ఉమ్మడి పౌరస్మృతిని అమలు చేసిన తొలి రాష్ట్రంగా ఉత్తరాఖండ్ నిలిచింది
- హరిద్వార్‌లో జరగనున్న కుంభమేళా సందర్భంగా ఉత్తరాఖండ్‌ను శుభ్రంగా ఉంచాలని పిలుపు

# మూసీ వంతెనలకు సామర్థ్య పరీక్షలు

- అత్యాధునిక డ్రోన్లతో గంటల్లోనే విశ్లేషణ
- అణువణువూ చిత్రీకరించే అత్యాధునిక డ్రోన్లతో గంటల్లోనే విశ్లేషణ
- జేఎన్‌టీయూ ప్రొఫెసర్ ప్రాజెక్ట్‌కు కేంద్రం నుంచి రూ.1.70 కోట్లు
- వంతెనల సామర్థ్య పరీక్షలను నిర్వహించి రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక



హైదరాబాద్

మూసీ రివర్ ఫ్రంట్ అభివృద్ధి ప్రాజెక్టు ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో ప్రస్తుతం మూసీ నదిపై ఉన్న 15 వంతెనల సామర్థ్యాన్ని పరీక్షించేందుకు రంగం సిద్ధమైంది. జేఎన్‌టీయూ హైదరాబాద్ ప్రొఫెసర్ అనిత షీలా, హైదరాబాద్ కేంద్రంగా కార్యకలాపాలు కొనసాగిస్తున్న ఏరో ఫోర్జ్ ల్యాబ్ అంకుర సంస్థలు డ్రోన్ల ద్వారా వంతెనల సామర్థ్య పరీక్షలను నిర్వహించి రాష్ట్ర ప్రభుత్వానికి త్వరలో నివేదికలు ఇవ్వనున్నాయి. డ్రోన్ సాంకేతికపై పరిశోధనలు నిర్వహిస్తున్న ప్రొఫెసర్ అనిత షీలా వంతెనల సామర్థ్య పరీక్షలకు డ్రోన్లను ఉపయోగిస్తే మరింత కాలం పరిరక్షించవచ్చని చెబుతున్నారు. పుణెలోని మూలా ముథా నది వంతెన సామర్థ్య పరీక్షలు నిర్వహించి కేంద్ర ప్రభుత్వ సంస్థ డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీకి నివేదిక అందజేశారు. అలాగే మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టులోనూ 15 వంతెనలకు ఇలాంటి పరీక్షలు నిర్వహిస్తామంటూ ప్రతిపాదనలు చేశారు. దీంతో ఆ డిపార్ట్‌మెంట్ అధికారులు - మిగతా3లో

# 850కి లోక్‌సభ స్థానాలు



దేశంలోని చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించే మూడు కీలక బిల్లులను కేంద్ర ప్రభుత్వం ఈనెల 16న లోక్‌సభలో ప్రవేశపెట్టనుంది. కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్‌రామ్ మేఘవాల్ 131వ రాజ్యాంగ చట్ట సవరణ బిల్లు, నియోజకవర్గాల పునర్విభజన బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టనున్నారు. ఈ బిల్లుల ద్వారా లోక్‌సభ, రాష్ట్రాల అసెంబ్లీల సీట్ల పునర్విభజన జరగనుంది. లోక్‌సభలో ప్రస్తుతం 543 స్థానాలు ఉండగా ఆ సంఖ్యను గరిష్టంగా 850కి పెంచే అవకాశం ఉంది. ఇందులో రాష్ట్రాలకు 815 స్థానాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు మరో 35 సీట్లు కేటాయించనున్నారు. తర్వాత ఈ చట్ట ప్రకారం లోక్‌సభ నియోజకవర్గాలపై డీలిమిటేషన్ కమిషన్ ఏర్పాటు చేయనుంది. సుప్రీం కోర్టు ప్రస్తుత లేదా మాజీ న్యాయమూర్తి స్థాయి వ్యక్తి ఛైర్మన్‌గా ఈ కమిషన్ ఏర్పాటు కానుంది. ప్రధాన ఎన్నికల కమిషనర్ లేదా ఆయన ప్రతినిధి, సంబంధిత రాష్ట్ర ఎన్నికల కమిషన్ ప్రతినిధి సభ్యులుగా ఉంటారు. కమిషన్‌కు సహాయ, సహకారాలను అందించేందుకు ప్రతి రాష్ట్రం నుంచి 10 మందిని సభ్యులుగా తీసుకుంటారు. ఆ రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహించే ఐదుగురు లోక్‌సభ సభ్యులు, ఐదుగురు శాసనసభ సభ్యులను సంబంధిత సభల స్పీకర్లు నామినేట్ చేస్తారు. 2011 జనాభా లెక్కల ప్రకారమే లోక్‌సభ సీట్ల పెంచాలని బిల్లులో కేంద్రం ప్రతిపాదించింది. ఆ గణాంకాల ప్రకారమే ఎస్సీ, ఎస్టీ, మహిళా రిజర్వేషన్లు ఖరారు అవుతాయన్న కేంద్రం మహిళలకు 33 శాతం రిజర్వేషన్ల అంశాన్ని కూడా బిల్లులో చేర్చింది. లోక్‌సభ, రాష్ట్రాల శాసనసభల్లో వీలైనంత మేరకు మూడో వంతు సీట్లను మహిళలకు కేటాయించేలా కమిషన్ చర్యలు తీసుకుంటుందని కేంద్రం తెలిపింది. ఈ సీట్లలో ఎస్సీ, ఎస్టీ మహిళలకు కూడా రిజర్వేషన్లు ఉంటాయని స్పష్టం చేసింది. రొటేషన్ విధానంలోనే రిజర్వేషన్లు అమలవుతాయని పేర్కొంది. మహిళలకు రిజర్వ్ చేసిన సీట్లను ఆయా రాష్ట్రాలు లేదా కేంద్రపాలిత ప్రాంతాల్లోని నియోజకవర్గాలకు రొటేషన్ పద్ధతిలో కేటాయిస్తారని తెలిపింది. నియోజకవర్గాల పునర్విభజనలో భౌగోళిక సమగ్రత, పరిపాలనా సరిహద్దులు, రవాణా సౌకర్యాలు వంటి అంశాలను డీలిమిటేషన్ కమిషన్ పరిగణనలోకి తీసుకుంటుందని కేంద్రం వెల్లడించింది.

కేంద్రపాలిత ప్రాంతాల శాసనసభల్లో నియోజకవర్గాల పునర్విభజన, మహిళా రిజర్వేషన్ల అమలును సులభతరం చేసేందుకు ఉద్దేశించిన కేంద్రపాలిత ప్రాంతాల చట్టాల సవరణ బిల్లు-2026'ను కేంద్ర హోంమంత్రి అమిత్ షా లోక్‌సభలో ప్రవేశపెట్టనున్నారు. ఈ బిల్లు ద్వారా అసెంబ్లీలు ఉన్న దిల్లీ, జమ్మూకశ్మీర్, పుదుచ్చేరికి సంబంధించిన 3 చట్టాలను సవరించనున్నారు. గవర్నమెంట్ ఆఫ్ యూనియన్ టెరిటరీస్ యాక్ట్-1963, గవర్నమెంట్ ఆఫ్ నేషనల్ క్యాపిటల్ టెరిటరీ ఆఫ్ దిల్లీ యాక్ట్-1991, జమ్ముకాశ్మీర్ పునర్వ్యవస్థీకరణ చట్టం-2019లో సవరణలు చేయనున్నారు. ఆయా శాసనసభల్లో నియోజకవర్గాల పునర్విభజన సహా 33 శాతం మహిళా రిజర్వేషన్ల అమలే లక్ష్యంగా ఈ సవరణలు చేయనున్నారు.

# బిహార్ కొత్త ముఖ్యమంత్రిగా సమ్రాట్ చౌధరీ

బిహార్‌లో కొంతకాలంగా నెలకొన్న ఉత్కంఠకు తెరదించుతూ రాష్ట్ర కొత్త ముఖ్యమంత్రిగా సమ్రాట్ చౌధరీ పేరు ఖరారైంది. ప్రస్తుత ముఖ్యమంత్రి నీతీశ్ కుమార్ తన పదవికి రాజీనామా చేయడంతో, బీజేపీ తన బలాన్ని నిరూపించుకుంటూ రాష్ట్ర పగ్గాలను చేపట్టబోతోంది. శాసనసభాపక్ష సమావేశంలో, సమ్రాట్ చౌధరీ తమ నాయకుడిగా ఎమ్మెల్యేలు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బుధవారం లోక్‌భవన్‌లో ఆయన సీఎంగా బాధ్యతలు చేపట్టనున్నట్లుగా సమాచారం. దీంతో బిహార్‌లో సమ్రాట్ శకం మొదలుకానుంది.

243 అసెంబ్లీ స్థానాలున్న బిహార్‌లో ఎన్‌డీఏకు 202 మంది సభ్యుల బలం ఉండగా, అందులో 89 మంది ఎమ్మెల్యేలతో బీజేపీ అతిపెద్ద పార్టీగా కొనసాగుతోంది. నీతీశ్ కుమార్ సీఎం పదవికి రాజీనామా చేసిన నేపథ్యంలో పట్నాలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో బీజేపీ శాసనసభాపక్ష సమావేశం ఏర్పాటు చేసింది. అందులో సమ్రాట్ చౌధరీ పేరును శాసనసభా పక్ష నేతగా మరో డిప్యూటీ సీఎం విజయ్ సిన్హా ప్రతిపాదించారు. దీంతో ఎమ్మెల్యేలు అందరూ సమ్రాట్ చౌధరీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శాసనసభ పక్ష సమావేశం అనంతరం సమ్రాట్ మీడియాతో మాట్లాడుతూ, ప్రజలకు సేవ చేయడానికే బీజేపీ తనకు ఈ అవకాశం ఇచ్చిందని తెలిపారు. సుమారు 30 ఏళ్లుగా రాజకీయ కార్యకర్తగా పని చేస్తున్నారని, కానీ ఇంతకుముందు తనకు ఎలాంటి సిద్ధాంతం లేదని, 2015 నుంచే బీజేపీ కోసం పనిచేస్తున్నాని గుర్తుచేశారు. నీతీశ్ కుమార్ నుంచి ఎన్నో విషయాలు నేర్చుకున్నట్లు చెప్పారు. ప్రభుత్వం ఎలా నడపాలి, బిహార్‌లో సుపరిపాలన ఎలా నెలకొల్పాలి, ప్రజాస్వామ్యానికి ఏది మంచిదనే అన్ని చెప్పారని పేర్కొన్నారు. ప్రధాని మోదీ వికసిత భారత్ దార్శనికత, నీతీశ్ కుమార్ సుసంపన్నమైన బిహార్‌ను ముందుకు తీసుకెళ్తామని అన్నారు.

**'బిహార్ ప్రజలకు సేవ చేసేందుకు ఓ అవకాశం'**



నూతన సీఎంగా ఎన్నికైన అనంతరం సమ్రాట్ చౌధరీ ఎక్స్‌లో పోస్ట్ చేస్తూ బీజేపీ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. 'బీజేపీ నాయకుడిగా బాధ్యతను అప్పగించి, నాపై విశ్వాసం ఉంచినందుకు పార్టీ నాయకత్వానికి నా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నా. ఇది నాకు కేవలం ఒక పదవి మాత్రమే కాదు. బిహార్ ప్రజలకు సేవ చేసేందుకు, వారి నమ్మకాన్ని, కలలను సాకారం చేసేందుకు లభించిన ఒక పవిత్రమైన అవకాశం. సంపూర్ణ అంకితభావం, నిబద్ధత చిత్తశుద్ధితో ప్రతి ఒక్కరి అంచనాలకు అనుగుణంగా నడుచుకుంటానని నేను ప్రతిజ్ఞ చేస్తున్నా. ప్రధాని మోదీ, నాయకత్వంలోనూ, పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ గారి మార్గదర్శకత్వంలోనూ బిహార్‌ను అభివృద్ధి, సుపరిపాలన సంపన్నతలో కొత్త శిఖరాలకు చేర్చడానికి నేను నిరంతరం కట్టుబడి ఉంటాను. మీ ఆప్యాయత, ఆశీస్సులు, సహకారమే నా అత్యంత గొప్ప బలం' అని సమ్రాట్ చౌధరీ పోస్ట్‌లో రాసుకొచ్చారు.

**సమ్రాట్ రాజకీయ ప్రస్థానం**

బిహార్ రాజకీయాల్లో అత్యంత కీలక నేతగా ఎదిగిన నాయకుడు సమ్రాట్ చౌధరీ. కుష్వాహా సామాజికవర్గానికి చెందిన బలమైన నాయకుడిగా, బీజేపీకి ఓబీసీ ముఖచిత్రంగా ఆయన గుర్తింపు పొందారు. ఆయన తండ్రి శకుని చౌధరీ ఏడుసార్లు ఎమ్మెల్యే, ఎంపీగా పని చేశారు. తల్లి పార్వతీ దేవి తారాపూర్ నుంచి ఎమ్మెల్యేగా పనిచేశారు. 57 సంవత్సరాల సమ్రాట్ చౌధరీ సామాన్య కార్యకర్త నుంచి రాష్ట్ర ముఖ్యమంత్రి స్థాయికి ఎదిగిన తీరు ఆసక్తికరంగా ఉంటుంది. రెండుసార్లు ఎమ్మెల్సీగా గెలిచిన సమ్రాట్ చౌధరీ, అసెంబ్లీ ఎన్నికలకు మొత్తం ఐదు సార్లు పోటీ చేయగా మూడు సార్లు విజయం సాధించారు. ప్రస్తుతం తారాపూర్ నియోజకవర్గానికి బీజేపీ ఎమ్మెల్యేగా ప్రాతనిథ్యం వహిస్తున్నారు.

**మూడు ప్రధాన పార్టీల్లో కీలక బాధ్యతలు**


రాజకీయ జీవితంలో సమ్రాట్ చౌధరీ మూడు ప్రధాన పార్టీల్లో కీలక బాధ్యతలు నిర్వహించారు. లాలూప్రసాద్ యాదవ్?కు చెందిన ఆర్‌జేడీలో 1990లలో సమ్రాట్ రాజకీయ జీవితం ప్రారంభించారు. 1999లో రబ్రీ దేవి ప్రభుత్వంలో అతితక్కువ వయస్సులో వ్యవసాయ మంత్రిగా పనిచేశారు. అయితే వయస్సుకు సంబంధించి చెలరేగిన వివాదాల కారణంగా ఆయన రాజీనామా చేయాల్సి వచ్చింది. 2014లో జేడీయూలో చేరిన సమ్రాట్, ఆ పార్టీలో చీలిక తెచ్చి తిరుగుబాటు నేతగా నిలిచారు. తర్వాత 2018లో కాషాయ కండువా కప్పుకున్న ఆయన, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా, 2023లో రాష్ట్ర అధ్యక్షుడిగా సైతం బాధ్యతలు నిర్వహించారు. 2021--22లో నీతీశ్ కుమార్ నేతృత్వంలోని ఎన్?డీయే ప్రభుత్వంలో ఉప ముఖ్యమంత్రిగా పనిచేశారు. 2025 ఎన్నికల తర్వాత మరోసారి ఉపముఖ్యమంత్రి బాధ్యతలు చేపట్టిన సమ్రాట్, హోంశాఖ వ్యవహారాలను సైతం చక్కబెట్టారు.

# ఆర్టికల్ 370 రద్దు తర్వాత పూర్తిగా అమల్లోకి రాజ్యాంగం

డాక్టర్ బీఆర్‌అంబేద్కర్ ఆశయాల మేరకు రాజ్యాంగ గౌరవాన్ని పునరుద్ధరించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ఆర్టికల్ 370 రద్దు తర్వాత దేశవ్యాప్తంగా రాజ్యాంగం పూర్తిగా అమల్లోకి వచ్చిందని తెలిపారు. ఉమ్మడి పౌరస్మృతిని అమలు చేసిన తొలి రాష్ట్రంగా ఉత్తరాఖండ్ నిలిచిందని కొనియాడారు. మంగళవారం దిల్లీ-డెహ్రాడూన్ ఎకనామిక్ కారిడార్‌ను ప్రధాని మోదీ ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడుతూ ఈ మేరకు వ్యాఖ్యలు చేశారు. చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు అమల్లో జాప్యం జరగడానికి వీల్లేదని ప్రధాని నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. 'ఈ రోజు అంబేద్కర్ జయంతి. ఆయనకు నేను హృదయపూర్వక నివాళులు అర్పిస్తున్నా. అంబేద్కర్ సామాజిక న్యాయానికి జీవితాంతం పోరాడారు. అదే దిశగా ప్రభుత్వం పనిచేస్తోంది. మౌలిక వసతులు, పరిశ్రమల అభివృద్ధి ద్వారా సమగ్ర ప్రగతి సాధ్యం అవుతుంది. ఆర్టికల్370 రద్దు తర్వాత రాజ్యాంగం పూర్తిగా అమల్లోకి వచ్చింది. మావోయిస్టు ప్రభావిత జిల్లాలు కూడా ఇప్పుడు రాజ్యాంగబద్ధంగా పనిచేస్తున్నాయి. ఉమ్మడి పౌర స్మృతిని అమలు చేయాలని మన రాజ్యాంగం మన నుంచి ఆశిస్తోంది. ఉత్తరాఖండ్ దీనిని ముందుకు తీసుకువెళ్లి దేశానికి ఒక మార్గాన్ని చూపింది' అని ప్రధాని మోదీ తెలిపారు.

**'2029 నుంచే అమలు కావాలి'**

నాలుగు దశాబ్దాల నిరీక్షణ తర్వాత పార్లమెంట్? నారీశక్తి వందన్ అదినియం ఆమోదించిందని ప్రధాని మోదీ తెలిపారు. 'మన సోదరీమణులు, అడబిడ్డల సంక్షేమం, రక్షణ, ప్రజాస్వామ్యంలో భాగస్వామ్యం అనేది డబుల్ సర్కార్ అత్యధిక ప్రాధాన్యాల్లో ఒకటి. శాసనసభలు, లోక్‌సభలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు ఖరారయ్యాయి. అన్ని



పార్టీలు ముందుకొచ్చి ఈ గొప్ప బిల్లుకు మద్దతు ఇచ్చాయి. మహిళలకు లభించిన ఈ హక్కు అమల్లో జాప్యం జరగడానికి వీల్లేదు. 2029లో లోక్‌సభ ఎన్నికలు జరుగుతాయి. ఆ తర్వాత అసెంబ్లీ ఎన్నికలు కూడా జరుగుతూ ఉంటాయి. 2029 నుంచే ఈ రిజర్వేషన్లు అమలు కావాలి. ఇది దేశంలో ప్రతీ సోదరి, ఆడవిడ్డ కోరిక. మాతృశక్తి ఆకాంక్షను గౌరవిస్తూ ఏప్రిల్ 16 నుంచి పార్లమెంటులో చర్చలు జరుగుతాయి. మహిళలకు సంబంధించిన ఈ పనిని అన్ని పార్టీలు కలిసి ఏకాభిప్రాయంతో పూర్తి చేయాలి' అని ప్రధాని మోదీ తెలిపారు.

**దేవభూమిని శుభ్రంగా ఉంచండి : ప్రధాని మోదీ**

హరిద్వార్‌లో జరగబోయే కుంభమేళాను వైభవోపేతంగా, దివ్యంగా, పరిశుభ్రంగా నిర్వహించాలని కూడా ప్రధాని మోదీ పిలుపునిచ్చారు. 'ప్లాస్టిక్ సీసాల కుప్పలు, చెత్తా చెదారం దేవభూమి పవిత్రతకు హాని కలిగిస్తున్నాయి. అందువల్ల, మన పుణ్యక్షేత్రాలైన దేవభూమి ప్రదేశాలను పరిశుభ్రంగా, అందంగా ఉంచుకోవడం చాలా ముఖ్యం. వచ్చే ఏడాది హరిద్వార్‌లో కుంభమేళా కూడా జరగనుంది. ఈ విశ్వాస సంగమాన్ని దివ్యంగా, వైభవంగా, పరిశుభ్రంగా తీర్చిదిద్దేందుకు మనం అన్ని విధాలా కృషి చేయాలి' అని ప్రధాని మోదీ తెలిపారు.

**'ఏడాది పొడవునా టూరిజం అవసరం'**

ఉత్తరాఖండ్?లో 12 నెలల పర్యటకం రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి ఎంతో కీలకమని ప్రధాని తెలిపారు. ముఖ్యంగా శీతాకాలంలో కూడా పర్యటకులను ఆకర్షించేలా రాష్ట్రం ముందుకు వస్తోందని చెప్పారు. వింటర్ టూరిజం, వింటర్ స్పోర్ట్స్, డెస్టినేషన్ వెడ్డింగ్స్‌కు ఉత్తరాఖండ్ ప్రముఖ కేంద్రంగా మారుతోందని పేర్కొన్నారు. ప్రధాని తన 2023 పర్యటనలో కైలాస్, ఓం పర్వత్ సందర్శించిన విషయాన్ని గుర్తుచేశారు. అప్పటి నుంచి యాత్రికుల సంఖ్య గణనీయంగా పెరిగిందని చెప్పారు. స్థానికులకు ఉపాధి అవకాశాలను పెంచిందని తెలిపారు. ఉత్తరాఖండ్ సహజ అందాలను, పవిత్రతను కాపాడితేనే పర్యటకం దీర్ఘకాలంగా అభివృద్ధి చెందుతుందని ప్రధాని పేర్కొన్నారు.

దిల్లీ-డెహ్రాడూన్ ఎకనామిక్ కారిడార్ వల్ల ఈ రెండు నగరాల మధ్య ప్రయాణ సమయం ఆరు గంటల నుంచి సుమారు 3 గంటలకు తగ్గనుంది. 213 కిలోమీటర్ల పొడవైన 6 వరుసల ఎకనామిక్ కారిడార్‌ను 12వేల కోట్లతో నిర్మించారు. మొదట సహారన్‌పూర్‌లో ఎకనామిక్ కారిడార్‌లో భాగంగా నిర్మించిన ఎలివేటెడ్ సెక్షన్‌లో వన్యప్రాణుల కారిడార్‌ను ప్రధాని పరిశీలించారు. సహారన్‌పూర్, డెహ్రాడూన్ వీధుల్లో రోడ్ షో నిర్వహించారు.డెహ్రాడూన్ సమీపంలోని మా దత్ కాళీ ఆలయంలో ప్రధాని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## ఛత్తీస్‌గఢ్ పవర్‌ప్లాంట్‌లో బాయిలర్ పేలుడు



ఛత్తీస్‌గఢ్‌లో ఘోర ప్రమాదం జరిగింది. ఒక పవర్ ప్లాంట్‌లోని బాయిలర్ పేలిన ఘటనలో 10 మంది మరణించగా, 40 మంది గాయపడ్డట్లు తెలుస్తోంది. ఈ ఘటన ఛత్తీస్‌గఢ్, శక్తి జిల్లా, సింగితారి గ్రామ సమీపంలోని వేదాంత పవర్ ప్లాంట్‌లో మంగళవారం మధ్యాహ్నం రెండు గంటల సమయంలో జరిగింది. ప్రాథమిక సమాచారం ప్రకారం.. పవర్ ప్లాంట్‌లోని బాయిలర్ ఉన్నట్లుండి పేలిపోయింది. ఘటన జరిగినప్పుడు చాలా మంది కార్మికులు పరిశ్రమ లోపల పని చేస్తున్నారు. ఈ పేలుడు భారీగా ఉండటంతో అక్కడ పని చేస్తున్న కార్మికుల్లో 10 మంది మరణించారు. మరో 30 నుంచి 40 మంది వరకు గాయపడ్డారు. ఈ ఘటనతో అక్కడ తొక్కిసలాట లాంటి పరిస్థితి తలెత్తింది. పేలుడు జరగడంతో అక్కడి కార్మికులు పారిపోయేందుకు ప్రయత్నించగా, ఇంకొందరు గాయపడ్డట్లు తెలుస్తోంది. ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు, అధికారులు అక్కడికి చేరుకుని సహాయక చర్యలు ప్రారంభించారు. గాయపడ్డవారిని స్థానిక ఆస్పత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. వీరిలో చాలా మంది పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఇంకా సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. పేలుడుకు గల కారణాలు ఇంకా తెలియరాలేదు. ప్రమాదం జరిగిన ప్రదేశంలో దృశ్యాలు హృదయవిదారకంగా ఉన్నాయి. అయితే, ఈ అంశంపై ఇప్పటివరకు అధికారికంగా ఎలాంటి సమాచారం వెల్లడించలేదు.

## రాజ్యాంగాన్ని బీజేపీ, ఆరెస్సెస్ ఆలోచనలు ధ్వంసం చేస్తున్నాయి



బంగాల్ అసెంబ్లీ ఎన్నికల సమయం దగ్గరపడుతున్న తరుణంలో రాజకీయాలు వేడెక్కాయి. అధికార, విపక్షాలు ఒకరిపై ఒకరు తీవ్ర ఆరోపణలు చేసుకుంటున్నారు. ఈ క్రమంలో కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, బీజేపీ ఆరెస్సెస్‌పై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. విద్వేషంతో నిండిన బీజేపీ, ఆరెస్సెస్ ఆలోచనలు రాజ్యాంగాన్ని ధ్వంసం చేస్తున్నాయని ఆరోపించారు. కాషాయ పార్టీ ఓట్ల దొంగతనానికి పాల్పడుతోందని విమర్శించారు. బంగాల్‌లోని ఉత్తర్‌దినాజ్‌పూర్ జిల్లాలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న రాహుల్ గాంధీ ఈ మేరకు వ్యాఖ్యానించారు. "బంగాల్‌లో త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ పోరులో బీజేపీ పార్టీ ఉంది. వారిది విద్వేషపూరిత భావజాలం, హింసను ప్రేరేపిస్తారు. వారి ప్రధానమంత్రి కూడా ఒక రాజీ పడిన వ్యక్తి, అలాంటి వారి గురించి మాట్లాడాల్సిన అవసరమే లేదు. అదేవిధంగా, బంగాల్‌లో టీఎంసీ పార్టీ కూడా ఉంది. ఈ టీఎంసీ పార్టీయే బీజేపీకి దారి చూపిస్తోంది. ఒకవేళ టీఎంసీ తన బాధ్యతలను సరిగ్గా నిర్వర్తించి ఉంటే, మీకు సరైన ఉపాధిని కల్పించి ఉంటే, ద్వేషాన్ని వ్యాప్తి చేయకుండా ఉండి ఉంటే, అప్పుడు ఇక్కడ బీజేపీకి చోటే ఉండేది కాదు. అసలు బంగాల్‌లో బీజేపీ ఎక్కడా కనిపించేది కూడా కాదు."

**'బీజేపీ ప్రజాస్వామ్యాన్ని నాశనం చేస్తోంది'**

మరోవైపు, బీజేపీ ప్రజాస్వామ్యాన్ని నాశనం చేస్తోందని రాహుల్? గాంధీ ధ్వజమెత్తారు. బంగాల్‌లో బీజేపీ ఓటు చోరీ చేసేందుకు సీఎం మమతాబెనర్జీ నేతృత్వంలోని తృణమూల్ కాంగ్రెస్ ప్రభుత్వమే అవకాశం ఇచ్చిందని దుయ్యబట్టారు. యువతకు ఉద్యోగాలు కల్పిస్తామని అధికారంలోకి వచ్చిన టీఎంసీ, ఆ పని చేయలేకపోయిందని విమర్శలు గుప్పించారు. ఐదు లక్షల మందికి ఉద్యోగాలు ఇస్తామని సీఎం మమతా వాగ్దానం చేశారని, అయితే, రాష్ట్రంలో మాత్రం 84 లక్షల మంది యువత నిరుద్యోగ భృతి కోసం దరఖాస్తు చేసుకున్నారని ఆయన గుర్తుచేశారు. మరోవైపు, ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)పై కూడా రాహుల్ గాంధీ మాట్లాడారు. ఎస్ఐఆర్ ప్రక్రియ కారణంగా బంగాల్‌లో చాలా మంది పేర్లు ఓటర్ల జాబితా నుంచి తొలగించారని, అయితే కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన తర్వాత తొలగింపునకు గురైన వారి పేర్లను తిరిగి చేర్చుతామని హామీ ఇచ్చారు. కాషాయ శిబిరానికి వ్యతిరేకంగా నిలబడి ఓడించగల ఏకైక పార్టీ కాంగ్రెస్ మాత్రమేనని రాహుల్? పేర్కొన్నారు.

**బంగాల్‌లో నిరుద్యోగానికి టీఎంసీయే కారణం**

అదేవిధంగా, బంగాల్‌లో నిరుద్యోగానికి టీఎంసీయే కారణమని రాహుల్? గాంధీ ఆరోపించారు. టీఎంసీ బంగాల్‌లోని అన్ని పరిశ్రమలను మూసివేసి, సిండికేట్ల ద్వారా రాష్ట్రాన్ని నడుపుతోందని ఆరోపించారు. ఈ సందర్భంగా శారదా, రోజ్ వ్యాలీ కేసుల వంటి పాంజీ స్కామ్‌లను ప్రస్తావించారు. టీఎంసీ సభ్యులు నడుపుతున్న సిండికేట్లు, లంచగొండితనం ద్వారా లబ్ధి పొందుతున్నాయని ఆరోపించారు. టీఎంసీ హింసకు పాల్పడుతోందని, తప్పుడు వాగ్దానాలు చేస్తోందని కూడా రాహుల్ విమర్శించారు. ఇదిలా ఉండగా, బంగాల్‌లో కాంగ్రెస్ పార్టీ ఇస్తున్న ఐదు హామీల గురించి రాహుల్ గాంధీ ప్రస్తావించారు. మెరుగైన ఆరోగ్య సేవలు, విద్య, రైతులకు మద్దతు, యువతకు ఉద్యోగ అవకాశాలు, మహిళలకు నెలవారీ ఆర్థిక సహాయం అందిస్తుందని పేర్కొన్నారు. రూ.10 లక్షల వరకు ఆరోగ్య బీమా, జిల్లా ఆసుపత్రుల్లో ఉచిత డయాలసిస్, క్యాన్సర్ చికిత్సను అందిస్తుందని ఆయన పేర్కొన్నారు. అలాగే, విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ వరకు, మహిళలకు పీజీ వరకు ఉచిత విద్య అందిస్తామని హామీ ఇచ్చారు. అదనంగా, పాఠశాలల్లో ఏఐ, ఆంగ్లంలో విద్య కూడా అందిస్తామని తెలిపారు. రైతులకు ఏటా రూ.15,000 సహాయం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌ను అందిస్తామని ఆయన ఇంకా హామీ ఇచ్చారు.

## హైవేలపై ఓవర్ లోడ్‌తో వెళ్లే వాహనాల ఫీజుకు సంబంధించి కొత్త రూల్స్

**- ఏప్రిల్ 15 నుంచి నిబంధనలు అమల్లోకి!**

జాతీయ రహదారులపై ఓవర్ లోడ్‌తో వెళ్లే వాహనాల నిబంధనల అమలును పటిష్టం చేయడం, హేతుబద్ధమైన ఫీజులు వసూలును నిర్ధారించటమే లక్ష్యంగా కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. జాతీయ రహదారుల ఫీజు (రేట్ల నిర్ధారణ, వసూలు) నాలుగో సవరణ నిబంధనలు 2026ను నోటిఫై చేసింది. ఈ సవరించిన నిబంధనలు 2026 ఏప్రిల్ 15 నుంచి అమల్లోకి వస్తాయని కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ మంగళవారం ప్రకటన విడుదల చేసింది.

**కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ ప్రకటన ప్రకారం**

నిర్దేశించిన లోడు పరిమితులను పాటించడాన్ని ప్రోత్సహించడం, రహదారి మౌలిక సదుపాయాలను పరిరక్షిస్తూ రోడ్డు భద్రతను పెంచడం ఈ సవరణ లక్ష్యమని కేంద్ర రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ తెలిపింది. సవరించిన రుసుము విధానం ప్రకారం, ఓవర్ లోడ్‌తో వెళ్తున్న వాహనాలకు లోడు శాతాన్ని బట్టి రుసుము విధిస్తామని స్పష్టం చేసింది. 10 శాతం వరకు ఓవర్ లోడ్‌తో వెళ్లే వాహనాలకు ఎలాంటి ఓవర్ లోడ్ రుసుము విధించమని పేర్కొంది. అయితే 10-40 శాతం వరకు ఓవర్ లోడ్‌తో వెళ్లే వాహనాలకు ప్రాథమిక రుసుముకు రెట్టింపు ఫీజును విధిస్తామని వెల్లడించింది. 40 శాతానికి పైగా ఓవర్ లోడుతో వెళ్లే వాహనాలకు ప్రాథమిక రుసుముకు నాలుగు రెట్లు అధికంగా ఫీజు వసూలు చేస్తామని చెప్పింది.

# తెలంగాణ రాష్ట్రానికి తీరని నష్టం

-మొదటిపేజీ తరువాయి

పోలిస్తే ఈ ప్రజా ప్రభుత్వంలో దళితులకి అత్యంత ప్రాధాన్యత ఇచ్చామని తెలిపారు. నియోజకవర్గాల పునర్విభజన విషయంలో బీజేపీ కుట్రలు చేస్తోందని విమర్శించారు. దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం చేసే కుట్ర చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

**పేదలకు నాణ్యమైన విద్య కోసం**

సమాన అవకాశాలతో దేశాన్ని అభివృద్ధి పథంలో నడపవచ్చని అంబేద్కర్ మార్గదర్శనం చేశారని రేవంత్ రెడ్డి అన్నారు. గాంధీ, అంబేద్కర్ దేశానికి రెండు కళ్ల లాంటివారని కొనియాడారు. రక్తం చిందకుండా యుద్ధం గెలవచ్చని గాంధీ నిరూపించారని, బలమైన దేశంగా భారత్ ఎదగడానికి అంబేద్కర్ కృషి చేశారని పేర్కొన్నారు. ప్రజల కలలు సాకారం చేసేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. పేదలకు నాణ్యమైన విద్య కోసం గతంలో లేని విధంగా చర్యలు చేపట్టామని, తెలంగాణ పబ్లిక్ స్కూల్ విధానంతో పిల్లల భవిష్యత్ మారుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. తెలంగాణ ఇంటిగ్రేటెడ్, పబ్లిక్ స్కూళ్ల ఏర్పాటుకు కృషి చేస్తున్నామని, గతంలో చేసిన అప్పులు, తప్పులను సరిదిద్దుకుంటూ ముందుకెళ్తున్నామని, పదేళ్ల విధ్వంసం వందేళ్ల నష్టానికి దారి తీసిందని వెల్లడించారు.

**తెలంగాణ రాష్ట్రానికి తీరని నష్టం**

కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలోనే మహిళా రిజర్వేషన్ బిల్లు రాజ్యసభలో ఆమోదం పొందిందని రేవంత్ రెడ్డి అన్నారు. ఈ బిల్లును లోక్‌సభలో కొన్ని పార్టీలు అడ్డుకున్నాయని ఆరోపించారు. ప్రస్తుతం దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం చేసే ప్రయత్నం చేస్తున్నారని, దక్షిణాదిన కుటుంబ నియంత్రణ వల్ల జనాభా తగ్గి సీట్లు కోల్పోయే పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రాల్లో దామాషా ప్రకారం 50 శాతం సీట్లు పెంచుతామన్నారని తెలిపారు. కేంద్రం ఆదేశాలు పాటించి జనాభా నియంత్రణ పాటిస్తే నష్టం చేస్తున్నారని, తెలంగాణ రాష్ట్రానికి తీరని నష్టంపై అభ్యంతరం లేవనెత్తామని స్పష్టం చేశారు.

**దక్షిణాది రాష్ట్రాలపై రాజకీయ కుట్ర**

కేంద్ర నిబంధనలు పాటిస్తే దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం చేస్తారా సీఎం ప్రశ్నించారు. దక్షిణాది రాష్ట్రాల్లో సీట్లు పెంచుకోవడంపై పోరాడాలని పిలుపునిచ్చారు. రాజ్యాధికారమే అంతిమ లక్ష్యమని అంబేద్కర్ చెప్పారని, రాజ్యాధికారం సాధించాలంటే సీట్ల సంఖ్య పెరగాలని డిమాండ్ చేశారు. దక్షిణాది రాష్ట్రాలపై రాజకీయ కుట్ర జరుగుతోందని విమర్శించారు. ఎస్సీ వర్గీకరణ చేసి చూపిన రాష్ట్రం తెలంగాణ అని, జనగణనతో పాటు కులగణన చేసిన ఏకైక రాష్ట్రం తెలంగాణ అని వివరించారు.

"గతంలో చేసిన అప్పులు, తప్పులను సరిదిద్దుకుంటూ ముందుకెళ్తున్నాం. అన్ని వర్గాలకు అభివృద్ధి, సంక్షేమం అందించేందుకు ప్రభుత్వం కృషిచేస్తోంది. పదేళ్ల విధ్వంసం వందేళ్ల నష్టానికి దారి తీసింది. గతంలో చేసిన అప్పులు చెల్లిస్తూ తప్పులు సరిదిద్దుతూ పాలన సాగిస్తున్నాం. వెనుక నుంచి గోతులు తవ్వేవారిని మీరే ఏదో ఒకటి చేయకపోతే నష్టం జరుగుతుంది. మహిళా రిజర్వేషన్లు, సీట్ల పెంపుపై కేంద్రం గందరగోళం సృష్టిస్తోంది"

**ప్రధాని మోదీకి రేవంత్ రెడ్డి లేఖ**

లోక్‌సభ నియోజకవర్గాల పెంపుపై అఖిలపక్ష భేటీ నిర్వహించాలని, జాతీయస్థాయిలో విస్తృత అభిప్రాయ సేకరణ తర్వాతే డీలిమిటేషన్ చేయాలని డిమాండ్ చేశారు. డీలిమిటేషన్‌పై అన్ని రాష్ట్రాలు, రాజకీయపార్టీల ఏకాభిప్రాయం సాధించాలని, కీలక నిర్ణయాల్లో రాష్ట్రాలు, రాజకీయ పార్టీల అభిప్రాయాలు తీసుకోవాలని కోరారు. నియోజకవర్గాల పెంపులో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం చేయొద్దని కోరారు. మహిళా రిజర్వేషన్లను వెంటనే అమలు చేయాలని, మహిళా రిజర్వేషన్లను డీలిమిటేషన్‌తో ముడిపెట్టవద్దని డిమాండ్ చేశారు. నియోజకవర్గాల పునర్విభజనలో హైబ్రిడ్ మోడల్ పాటించాలని, జనాభా నియంత్రణ, ఆర్థికవృద్ధి సాధించిన రాష్ట్రాలకు నష్టం చేయొద్దని తెలిపారు. పెరిగే సీట్లలో 50శాతం జనాభా ప్రాతిపదికన కేటాయించాలని, మిగతా 50శాతం సీట్లు ఆర్థికవృద్ధి ప్రాతిపదికన కేటాయించాలని, దక్షిణాది రాష్ట్రాలను రాజకీయంగా శిక్షించడం సరికాదని లేఖలో పేర్కొన్నారు. రేపు రాత్రికి రేవంత్ రెడ్డి దిల్లీ వెళ్లనున్నారు.



# మూసీ వంతెనలకు సామర్థ్య పరీక్షలు

-మొదటిపేజీ తరువాయి

రూ.1.70 కోట్లు మంజూరు చేశారు.

**డ్రోన్లతోనే ఎందుకంటే?**

అమెరికా, ఐరోపా దేశాల్లో డ్రోన్లతో వంతెనల సామర్థ్యాన్ని గంటల వ్యవధిలో వాటిని చిత్రీకరించి సివిల్, స్ట్రక్చరల్ ఇంజినీరింగ్ నిపుణులు నివేదించి ఆ లోపాలను గుర్తిస్తున్నారని ప్రొఫెసర్ అనిత షీలా తెలుసుకున్నారు. దీని ఆధారంగా చర్యలు తీసుకుంటే 40-50 సంవత్సరాల వరకు ఆ మూసీ వంతెనలు నిక్షేపంగా ఉంటాయని ఆ నివేదికల్లో ఉన్నాయి. ఈ మేరకు ఆమె పుణెలో వంతెన సామర్థ్యాన్ని పరీక్షించారు. సివిల్ ఇంజినీర్ల బృందం నిర్వహించే సర్వే, కాంక్రీట్ టెస్టులు, దానికి సంబంధించిన ఫలితాలకు 15 రోజులు సమయం తీసుకుంటే, షీలా బృందం రెండు రోజుల్లో పూర్తి స్థాయిలో నివేదిక రూపొందించింది.

**మిషన్ లెర్నింగ్ ద్వారా ప్రాథమిక నివేదిక**

లమన శరీరాన్ని ఎలా ఎక్స్‌రే తీస్తారో అదే తరహాలో డ్రోన్ల ద్వారా వంతెనల సామర్థ్యాన్ని పరీక్షిస్తారు. అందులో ఏ భాగాన్ని తాకకుండా అత్యాధునిక సాంకేతిక సమాచార పరిజ్ఞానంతో డ్రోన్లు ఆపాదమస్తకం చిత్రీకరిస్తాయి. ఫొటోలు, దృశ్యాలతో పాటు వంతెన అంతర్భాగంలో లోపాలను మిషన్ లెర్నింగ్ ద్వారా విశ్లేషించి ప్రాథమిక నివేదిక అందిస్తాయి. ఇది కృత్రిమ మేథ, మిషన్ లెర్నింగ్ సహకారంతో ఒక్కో అంశంపై పూర్తి వివరాలు తెలుస్తాయి. వాటి ఆధారంగా సివిల్, స్ట్రక్చరల్ ఇంజినీర్లు లోపాల సవరణకు సంబంధించి నివేదికను రూపొందిస్తారు. దీని ఆధారంగా పరిరక్షణ చర్యలు తీసుకోవచ్చు. మూసీ వంతెనల సామర్థ్య పరీక్షలు నిర్వహించేందుకు ఒక్కో వంతెనకు రెండు, మూడు గంటల సమయం సరిపోతుందని ప్రాజెక్ట్ బృందం సభ్యులు డాక్టర్ ఆదర్శ్ పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రయోగిస్తున్న డ్రోన్‌లో మల్టీస్పెక్ట్రమ్ కెమెరాలు, దూరం నుంచే పనిచేసే సెన్సర్లు ప్రత్యేకమని తెలిపారు.



**మూసీ సుందరీకరణ పనుల్లో మరింత వేగం**

మూసీ పునరుజ్జీవంలో భాగంగా ఇప్పటికే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మంచిరేవుల వద్ద ఓంకారేశ్వరాలయానికి భూమి పూజా కూడా పూర్తయింది. గాంధీ సరోవర్‌కు సంబంధించి నేషనల్ గ్రీన్ ట్రిబ్యూనల్‌లో ఇప్పటికే కొంత ఊరట లభించడంతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మూసీ సుందరీకరణ పనుల్లో వేగం పెంచే అవకాశం ఉంది. మూసీ నదిలో మురుగునీరు కలవకుండా ఎస్‌టీపీల నిర్మాణం, నది పరివాహక ప్రాంతాల్లో రిటైనింగ్ వాల్స్, చెక్ డ్యామ్‌ల ఏర్పాటు వంటి పనులపై అధికారులు కసరత్తు చేస్తున్నారు. గాంధీ సరోవర్, మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టు సంబంధించి అన్ని రకాల అనుమతులు తీసుకున్న తర్వాతే ముందుకేళ్తామని న్యాయవాది ఎన్‌జీటీ దృష్టికి తీసుకెళ్లారు. ప్రాజెక్టు సమగ్ర నివేదిక పూర్తి అవుతోందని, గాంధీ సరోవర్‌కు సంబంధించి తుది నిర్ణయాన్ని తీసుకోవాల్సి ఉంది. ఆ తర్వాత పర్యావరణానికి ఏమైనా నష్టం జరుగుతుందా అనే అంశాన్ని కూడా విశ్లేషిస్తామని ఎన్‌జీటీకి హామీ ఇచ్చారు.

# తెలంగాణలో నిప్పుల వర్షం

-మొదటిపేజీ తరువాయి

ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేశారు. ఎల్లుండి నుంచి ఎండలు మరింత తారెత్తించనున్నాయని అధికారులు తెలిపారు. ఇవాళ ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్ జిల్లాల్లో వడగాల్పులు వీచే అవకాశం ఉందని, రేపు ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, ఖమ్మం జిల్లాల్లో వడగాల్పులు వీచే అవకాశం ఉందని ప్రకటించారు. ఎల్లుండి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాల్లో వడగాల్పులు వీచే అవకాశం ఉందని తెలిపారు. ఎల్లుండి నిజామాబాద్, జగిత్యాల, సిరిసిల్ల, ఖమ్మం జిల్లాల్లో వడగాల్పులు వీచే అవకాశం ఉందని పేర్కొన్నారు. రాగల ఐదు రోజులపాటు రాష్ట్ర వ్యాప్తంగా ఎండల తీవ్రత పెరుగుతుందని హైదరాబాద్ వాతావరణ శాఖ అధికారి ధర్మరాజు తెలిపారు. ఉత్తర, దక్షిణ తెలంగాణ జిల్లాలతోపాటు హైదరాబాద్ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేసినట్లు తెలిపారు. వడగాల్పుల తీవ్రత కూడా ఉత్తర తెలంగాణ జిల్లాలపైనా ఉంటుందంటుని అన్నారు. "గత రెండు రోజులుగా ఎండ వేడిమి, తీవ్రత రోజురోజుకు పెరిగిపోతుంది. నిన్న ఎండ వేడిమితో పాటు గాలిలో తేమ శాతం పెరిగింది. అదిలాబాద్? జిల్లా 42 డిగ్రీల ఉష్ణతీవ్రత కొనసాగుతోంది. నిజామాబాద్? జిల్లా 42.4 డిగ్రీల ఉష్ణతీవ్రత కొనసాగుతోంది. హైదరాబాద్? నగరంలో గత మూడు రోజులుగా క్రమేపి పెరుగుతూ వచ్చింది. నగరంలో 40.1 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. రానున్న 5 రోజుల పాటు ఉష్ణోగ్రతపెరిగే అవకాశం ఉంది"

**హైదరాబాద్‌లో ఈ ఏడాది తొలిసారిగా 40ఠీజ దాటింది.**

| | |
|---|---|
| హిమాయత్‌నగర్ | 40.6 |
| ముషీరాబాద్ | 40.6 |
| మెట్టుగూడ | 40.6 |
| బేగంపేట్ | 40.5 |
| మౌలాలీ | 40.5 |
| హయత్‌నగర్ | 40.5 |
| మలక్‌పేట | 40.5 |
| ఉప్పల్ | 40.4 |
| కాప్రా | 40.4 |
| మియాపూర్ | 40.4 |
| కార్వాన్ | 40.3 |
| యూసుఫ్‌గూడ | 40.3 |
| షేక్‌పేట | 40.2 |
| రాజేంద్రనగర్ | 40.2 |
| శేరిలింగంపల్లి | 40.1 |

వచ్చే 6రోజుల్లో ఉష్ణోగ్రతలు 41-42ఠీజ దాటవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు.

**వడ దెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు :**

వడ దెబ్బ నివారణకు జాగ్రత్తలు పాటించాలని ప్రకృతి విపత్తుల నిర్వహణ విభాగం సూచనలు ఇస్తోంది.

ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3.30 గంటల మధ్య వీలైనంత వరకు ఎండ నుంచి దూరంగా ఉండటం మంచిది.

తగినంత నీళ్లు లేదా జ్యూసులు లాంటివి ఎక్కువగా తీసుకోవాలి. శరీర ఉష్ణోగ్రత ఒక్కసారిగా 104 డిగ్రీల ఫారెన్?హీట్? (40 డిగ్రీలకు చేరితే) వడదెబ్బ సోకినట్లుగా గుర్తించి వెంటనే హాస్పిటల్?కు తరలించాలి.

పట్టణ ప్రాంతాల్లో కూల్? వార్డులు ఏర్పాటు చేసి, వడ దెబ్బ బాధితులకు చికిత్స అందించేందుకు చర్యలు తీసుకోవాలి.

కార్మికులు మధ్యాహ్నం గంట లేదా రెండు గంటల పాటు నీడపట్టున విశ్రాంతి తీసుకోవడం ముఖ్యం.

పరిశ్రమలు, సంస్థల్లో పని చేసే కార్మికులకు రొటేషన్? పద్ధతిని అమలు చేయాలి.

వడదెబ్బ కారణంగా మృతి చెందితే ప్రభుత్వం పరిహారం అందిస్తుంది. దీనిని ఇటీవల రూ.50 వేల నుంచి రూ.4 లక్షలకు పెంచింది. మండల స్థాయిలోని రెవెన్యూ, పోలీసు, వైద్య శాఖల అధికారులతో కూడిన త్రిసభ్య కమిటీ వడదెబ్బ మరణాలను నిర్ధారిస్తుంది.

**ఈ జాగ్రత్తలు తప్పనిసరి : -**

ఎండలో తప్పనిసరిగా బయటికి వెళ్లాలంటే టోపీ, గొడుగు, తెల్లని రుమాలు ధరించండి.

నీరు, ఇతర ద్రవ పదార్థాలు ఎక్కువ తీసుకోవాలి.

తెల్లని నూలు వస్త్రాలు ధరించడం ఉత్తమం.

కూల్? డ్రింక్స్?, మత్తు పానీయాల జోలికి వెళ్లకూడదు.

వడదెబ్బ సోకిన వారికి 15 నిమిషాలకు ఒకసారి కోల్డ్? స్పాంజింగ్? చేయాలి. చికిత్స చేయించాలి.

## ఆర్థికవృద్ధి ప్రకారం చట్టసభల్లో సీట్లు పెంచే విధానం ఎక్కడా లేదు

-మొదటిపేజీ తరువాయి

చెప్పారు. ఈసారి జనగణన, కులగణన పూర్తి కావడానికి సమయం ఎక్కువ పడుతుందని మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. జనగణన, కులగణన పూర్తి తర్వాతే డీలిమిటేషన్ కమిటీ వేయాలంటే మరింత సమయం పడుతుందని పేర్కొన్నారు. అందుకే జనగణనకు ముందే డీలిమిటేషన్ కమిటీ వేస్తామని చెప్పారు. కొత్తగా ఏర్పడే నియోజకవర్గాలకు సరిహద్దులు నిర్ణయించడానికి చాలా సమయం పడుతుందన్న ఆయన 2029 ఎన్నికలలోపు అన్ని ప్రక్రియలు పూర్తి చేయటం సాధ్యం కాదని అన్నారు. 2029 ఎన్నికల్లో మహిళా రిజర్వేషన్లు అమలు చేయాలని కేంద్రం కృతనిశ్చయంతో ఉందని స్పష్టం చేశారు.

**ప్రతి రాష్ట్రంలో 50 శాతం పెంపు**

రాష్ట్రాలకు ఇచ్చే నిధులను 32 నుంచి 42 శాతానికి ఎన్డీఏ సర్కార్ పెంచిందని కిషన్ రెడ్డి గుర్తు చేశారు. డీలిమిటేషన్‌ను జనాభా ప్రాతిపదికన చేస్తే దక్షిణాదికి నష్టమని ఇన్ని రోజులు అన్నారని ఇప్పుడు జనాభా ప్రాతిపదికన కాకుండా ప్రతి రాష్ట్రంలో 50 శాతం సీట్లు పెంచుతున్నట్లు చెప్పారు. ప్రతి రాష్ట్రంలో 50 శాతం సీట్లు పెంపుపై కూడా కొంతమంది వితండవాదం చేస్తున్నారని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ పార్టీయే తెలుగు ప్రజలను ఇన్నాళ్లు బంట్రోతులుగా చూసిందని, అంజయ్య, ఇతర సీఎంలను కాంగ్రెస్ పెద్దలు ఎలా అవమానించారో ప్రజలు గమనించారని గుర్తుచేశారు.

**రాహుల్ గాంధీ కేరళకు వలస రాలేదా?**

దక్షిణాదికి కీలక శాఖలు ఇవ్వట్లేదని సీఎం రేవంత్‌రెడ్డి అంటున్నారన్న కిషన్‌రెడ్డి ఉపరాష్ట్రపతి పదవులు చేపట్టిన వెంకయ్యనాయుడు, సీపీ రాధాకృష్ణన్ దక్షిణాది వాళ్లు కాదా? అని ప్రశ్నించారు. తనతో సహా ఎంతోమంది దక్షిణాది నేతలు కేంద్రమంత్రులుగా ఉన్నారని సమాధానమిచ్చారు. ఎంపీ లక్ష్మణ్ ఉత్తరాదికి వలసపోయారని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారని రాహుల్‌గాంధీ యూపీ వదిలిపెట్టి కేరళకు రాలేదా? సూటిగా ప్రశ్నించారు. దక్షిణాది సీఎంలు వెళ్తే రాహుల్‌గాంధీ దిల్లీలో అపాయింట్‌మెంట్ కూడా ఇవ్వట్లేదన్న ఆయన కాంగ్రెస్ పార్టీ రాహుల్‌గాంధీ బుద్ధితో రేవంత్‌రెడ్డి డబ్బుతో నడుస్తోందని ధ్వజమెత్తారు.

**రేవంత్ రెడ్డి అబద్ధాలు మాట్లాడొద్దు**

సీఎం రేవంత్ రెడ్డి ప్రతిపాదన ప్రకారం వెళ్తే అసెంబ్లీ సీట్లన్నీ జీహెచ్‌ఎంసీ పరిధిలోనే పెరుగుతాయన్న కిషన్ రెడ్డి అబద్ధాలు మాట్లాడి ప్రజలను తప్పుదోవ పట్టించవద్దని విజ్ఞప్తి చేస్తున్నట్లు తెలిపారు. జనాభా ప్రకారం వెళ్తే దక్షిణాదికి నష్టమని గతంలో వాదించారని కొత్తగా ప్రతి రాష్ట్రంలో 50 శాతం ప్రకారం వెళ్తుంటే ఇప్పుడు కూడా వ్యతిరేకిస్తున్నారని చెప్పారు. ఏ పార్టీ అధికారంలో ఉండాలనేది అంతిమంగా ప్రజలు నిర్ణయిస్తారని అన్నారు. ఏ రాష్ట్రానికి నష్టం జరగకూడదనే 50 శాతం నిష్పత్తి ప్రకారం పెంచుతున్నారని తెలిపారు. "ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు వితండవాదం తీసుకొచ్చే ప్రయత్నం చేస్తున్నారు. అద్దాలమేడలో కూర్చుని ఎదుటివారిపై రాళ్లు విసరొద్దని నేను విజ్ఞప్తి చేస్తున్నా. ఆయన చెబుతున్నది అంబేద్కర్ గారి ప్రతిపాదనకు పూర్తి విరుద్ధం. రేవంత్ రెడ్డి 50 శాతం జనాభా ఆధారంగా, 50 శాతమే అభివృద్ధిని చూసి లోక్?సభ, అసెంబ్లీలో సీట్లు పెంచాలని అంటున్నారు. ప్రపంచంలో ఎక్కడా విధానం అందుబాటులో లేదు. ఇలా చూస్తే తెలంగాణలో ఆదిలాబాద్?, మహబూబ్?నగర్?లలో సీట్లు తగ్గించి, హైదరాబాద్?, రంగారెడ్డి జిల్లాల్లో అసెంబ్లీ సీట్లు పెంచుతారా" -కిషన్ రెడ్డి, కేంద్రమంత్రి

## ఆర్టీసీ కార్మికులు సమ్మె నిర్ణయం వెనక్కి తీసుకోవాలి

-మొదటిపేజీ తరువాయి

జేఏసీ తమతో మాట్లాడి తమ సమస్యలను సామరస్యంగా పరిష్కరించుకోవాలని పొన్నం ప్రభాకర్ సూచించారు. ఖైరతాబాద్?లోని రవాణాశాఖ కార్యాలయంలో జరిగిన అరైవ్ అలైవ్ కార్యక్రమం అనంతరం ఆర్టీసీ సమ్మెపై మంత్రి పొన్నం ప్రభాకర్ స్పందించారు. ఆర్టీసీ ఉద్యోగుల మూడు ప్రధాన డిమాండ్లపై కమిటీ వేశామని, ఆ కమిటీ ఆ అంశాల మీదనే పని చేస్తోందని తెలిపారు. ఆర్టీసీ సమస్యల పరిష్కారానికి ఆర్థిక శాఖతో చర్చించేందుకు తాను కూడా వారితో కలిసి వస్తానని హామీ ఇచ్చారు. సమ్మె ద్వారా గ్రామీణ ప్రాంత ప్రజలు ఇబ్బందులు పడతారని, సమ్మెకు వెళ్లొద్దని ఆర్టీసీ ఉద్యోగులను కోరారు. తాను కూడా ఉద్యమ నేతనే అని, తనకు ఆర్టీసీ అన్నా కార్మికులు అన్నా, ఉద్యోగులు అన్నా అభిమానం ఉందని అన్నారు. తమ ప్రభుత్వం ఉద్యోగుల పక్షపాతంగా వ్యవహరిస్తోందని అన్నారని, గత ప్రభుత్వం ఆర్టీసీ కార్మికులు సమ్మె చేస్తే అణిచివేసిందని గుర్తుచేశారు. ఎలక్ట్రిక్ బస్సులు కేంద్ర ప్రభుత్వ పథకం నుంచి తీసుకొచ్చినవి అని, వాటిపై అనవసరమైన రాద్ధాంతం చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈవీ బస్సులు రావడం వల్ల ఆర్టీసీలో ఏ ఒక్క ఉద్యోగం పోదని తాను గ్యారెంటీ ఇస్తున్నానని స్పష్టం చేశారు. "ఆర్టీసీ కార్మికులు సమ్మె నిర్ణయం వెనక్కి తీసుకోవాలి. ఆర్టీసీ సంస్థ పరిరక్షణ, ప్రజాప్రయోజనాల కోసం కార్మికులు కృషి చేయాలి. ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది. ఆర్టీసీ విలీనం, కార్మిక సంఘాల అంశాలు ప్రభుత్వ పరిధిలో ఉన్నాయి. ఆర్టీసీ విలీనానికి సంబంధించి కమిటీ పని చేస్తోంది. ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు చెప్పుకోడానికి మా తలుపులు తెరిచే ఉన్నాయి. కార్మికులు ఎవరైనా వచ్చి సమస్యలు చెప్పవచ్చు"

**స్పందన రాకపోవడంతో సమ్మె**

ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలన్న ప్రధాన డిమాండ్‌తో జేఏసీ నేతలు మార్చి 13వ తేదీనే సమ్మె నోటీసులు ఇచ్చారు. అనంతరం లేబర్ కమిషనర్ కార్యాలయానికి వెళ్లి సమ్మె నోటీసు అందజేశారు. ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేసే ప్రక్రియను వెంటనే చేపట్టాలని యూనియన్? నాయకులు డిమాండ్ చేశారు. 2021 వేతన సవరణ 30 శాతం ఫిట్‌మెంట్‌తో అమలు చేయాలని, మహాలక్ష్మి పథకం కింద ప్రతినెలా మహాలక్ష్మి పథకం కింద ఇచ్చే రూ.350 కోట్లలో ఎలాంటి కోతలు, షరతులు లేకుండా సక్రమంగా విడుదల చేయాలని వారు గతంలో సమ్మె నోటీసు ఇచ్చిన సందర్భంగా పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, యాజమాన్యం నుంచి ఎలాంటి స్పందన రాకపోవడంతో ఈ నెల 22 నుంచి సమ్మెకు వెళ్తున్నట్లు ఆర్టీసీ జేఏసీ ప్రకటించింది.

## 70 నియోజకవర్గాల్లో సమీకృత గురుకుల పాఠశాలలు



హైదరాబాద్ : రాష్ట్రంలో విద్యా వ్యవస్థను బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. సత్తుపల్లి నియోజకవర్గం, కల్లూరు మండలం చెన్నూరులో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... మొదటి విడతలో 70 నియోజకవర్గాల్లో రూ. 200 కోట్లతో ఈ సమీకృత గురుకుల పాఠశాలల నిర్మాణానికి శ్రీకారం చుట్టామని మంత్రి వెల్లడించారు. ఈ ప్రాజెక్టులు కేవలం శిలాఫలకాలకే పరిమితం కాకుండా, నిర్ణీత సమయంలోగా పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. కల్లూరును ప్రత్యేక నియోజకవర్గంగా మార్చడం అనేది కేంద్ర ప్రభుత్వం చేపట్టే నియోజకవర్గాల పునర్విభజన సమీకరణలపై ఆధారపడి ఉంటుందని వివరించారు. సత్తుపల్లి ప్రాంతంలో మూడు పెద్ద ఆసుపత్రులు ఏర్పాటు చేయబోతున్నామని, పెండింగ్‌లో ఉన్న ఆసుపత్రుల నిర్మాణాలను పూర్తి చేసి ఈ ప్రాంతాన్ని ఎడ్యుకేషన్ హబ్‌గా తీర్చిదిద్దుతామని ప్రకటించారు. ఆర్థిక సవాళ్లు ఎదురైనా రైతు రుణమాఫీ, ఇందిరమ్మ ఇళ్లు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ. 500 బోనస్ వంటి పథకాలకు, విద్య, వైద్యానికి తమ ప్రభుత్వం ప్రాధాన్యతను ఇస్తోందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్, జిల్లా కలెక్టర్ అనుదీప్, అడిషనల్ కలెక్టర్ శ్రీజతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# గౌరిపల్లిలో ఘనంగా అంబేద్కర్ జయంతి వేడుకలు

అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)

తలకొండపల్లి మండలం లోని గౌరిపల్లి గ్రామంలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని అంబేద్కర్ చిత్రపటానికి సర్పంచ్ కళ్యాణ్ నాయక్, ఉపసర్పంచ్ రమేష్ యాదవ్ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.అనంతరం వారు మాట్లాడుతూ, అంబేద్కర్ ఆశయాలు ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయమని, ఆయన చూపిన మార్గంలో నడవాలని సూచించారు. సామాజిక సమానత్వం, విద్యాభివృద్ధి కోసం ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు.ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి నర్సింహ ,వార్డు సభ్యులు బండారి స్వామి, వసుపుల లవకుమార్, వసుపుల సురేష్, జాల కృష్ణమ్మ, బండారి నారమ్మ, కేతావత్ డోలి, కేతావత్ భాస్కర్, మాజీ



సర్పంచ్ నరేందర్ గౌడ్,గ్రామ పెద్దలు, యువకులు, ప్రజాప్రతినిధులు మరియు గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని అంబేద్కర్‌కు ఘన నివాళులు అర్పించారు.

## గొల్లపల్లి రిజర్వాయర్ వల్ల కల్వకుర్తి ప్రాంతం ఎడారి



**ప్రాజెక్ట్ ఆపకపోతే రైతుల తరుపున మరో ఉద్యమం**

**బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాష్ట్ర ఫుడ్ కమీషన్ ఛైర్మెన్ గోలి శ్రీనివాస్ రెడ్డి**

అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)

ఈ రిజర్వాయర్ వల్ల చివరి ఆయకట్టు ప్రాంతమైన కల్వకుర్తి కి అన్యాయం జరుగుతుంది అని బీ ఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి అన్నారు.వెల్దశీ డ మండల కేంద్రములో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ,మాజీ ముఖ్య మంత్రి కె చంద్రశేఖర్ రావు నాయకత్వంలో 2001సంవత్సరం లో తెలంగాణ ఉద్యమ సమయంలో అప్పటి ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు 2.5 లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తామని ప్రగల్బాలు పలికి కేవలం 50 వేల ఎకరాలకు పరిమితం చేసి ఈ ప్రాంతానికి అన్యాయం చేశారు అన్నారు తెలంగాణ ఆవిర్భావము తరువాత తోలి ముఖ్య మంత్రి కెసిఆర్ 20 టీఎంసీల నిల్వ సామర్థ్యం గల రిజర్వాయర్లను నిర్మించేందుకు సర్వేకు ఆదేశించారు అన్నారు.దీనికి సంబంధించి దాదాపు 40 రిజర్వాయర్లు నిర్మించడానికి అనువుగా వున్నా అప్పటికే పాలమూర్ రంగారెడ్డి పనులకు అడుగులు పడటం రిజర్వాయర్లు పూర్తి కావడం నీళ్లు వచ్చి రైతుల భూములకు విలువ పెరగడంతో వారికి ఇబ్బంది ఉండకూడదని రిజర్వాయర్లను వాయిదా వేశారు అన్నారు కానీ ఇప్పుడు ఈ ప్రాజెక్ట్ పేరిట డబ్బులు దండుకోవాలని కాంగ్రెస్ పార్టీ ప్రభుతం చూస్తుందని ఆయన అన్నారు. కాబట్టి ఈ ప్రాజెక్ట్ ను వాయిదా వేయాలి దీనిపై ప్రభుత్వం స్పందించకుండా ఉంటే ఉద్యమాలు చేసి ఇక్కడి రైతాంగాన్ని కాపాడుకుంటాం అని గోలి శ్రీనివాస్ రెడ్డి అన్నారు.

## విద్యుత్ ఆర్టిజన్‌ల నిరవధిక సమ్మె 7వ రోజుకు అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పణ



అగ్ని ధార న్యూస్, (రామగుండం):

రాష్ట్ర విద్యుత్ ఆర్టిజన్‌ల సంయుక్త చర్య కమిటీ పిలుపుతో కొనసాగుతున్న విద్యుత్ ఆర్టిజన్ కార్మికుల నిరవధిక సమ్మె మంగళవారం 7వ రోజుకు చేరుకుంది. సమ్మె నేపథ్యంలో అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని రామగుండం అంబేద్కర్ కూడలిలోని డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి కార్మికులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.అనంతరం కార్మికులు అంబేద్కర్ విగ్రహం వద్దకు వినతిపత్రం సమర్పిస్తూ తమ నిరసనను వ్యక్తం చేశారు. సమ్మె 7వ రోజుకు చేరుకున్నప్పటికీ ప్రభుత్వం, యాజమాన్యం ఇప్పటివరకు చర్చలకు పిలవకపోవడం పట్ల ఆర్టిజన్ కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ, యాజమాన్యాల మొండి వైఖరిని నిరసిస్తూ అంబేద్కర్ విగ్రహానికి డిమాండ్ నోటీసు అందజేశారు.కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించి చర్చలకు ఆహ్వానించాలని ఈ సందర్భంగా వారు డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో కొంకటి శ్రీనివాస్, వడ్డేపల్లి సురేష్, ఆవుల మహేష్, దుర్గం విశ్వనాథ్, జి. లక్ష్మణ్, మల్లారపు ప్రభాకర్, ఎస్. రవి, ధర్మ నాయక్, శ్రీనాథ్, బోరే శ్రీనివాస్, సందీప్, ప్రణయ్, జనార్ధన్, ఆర్. రమేష్, శరత్, సదానందం, కుమార్, రవి కుమార్, శ్రీకృష్ణ, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

## వచ్చే ఏప్రిల్ నుంచే కేఫ్ 3 నిబంధనలు

కార్పొరేట్ యావరేజ్ ఫ్యూయల్ ఎఫిషియెన్సీ 3(కేఫ్ 3) ప్రమాణాల అమలు గడువును ప్రభుత్వం పొడిగించే అవకాశం లేదని భారీ పరిశ్రమల మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి హనీఫ్ ఖురేషి తెలిపారు. వచ్చే ఏడాది ఏప్రిల్ 1 నుంచి వాహన తయారీదారులు కఠిన ఇంధన సామర్థ్య నిబంధనలను పాటించాల్సి ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. కేఫ్ 3 నిబంధనలపై ప్రభుత్వం ఆటో పరిశ్రమ భాగస్వాములతో నిరంతరం సంప్రదింపులు జరుపుతోంది, వారికి ఎప్పటికప్పుడు సమాచారం ఇస్తూ, అభిప్రాయాలను క్రమం తప్పకుండా కోరుతున్నామన్నారు.

## ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా నిరుపేద కుటుంబ ఇంటి నిర్మాణానికి సిమెంట్ అందజేత



**బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు ట్రస్ట్ ఛైర్మన్ ఉప్పల వెంకటేష్**

అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)

కల్వకుర్తి మండలం పంజుగుల్ గ్రామంలోని మాధగోని ఎల్లమ్మ అనే ఒంటరి మహిళలకు చెందిన ఇంటి నిర్మాణం అసంపూర్తిగా మిగిలిపోవడంతో స్థానిక నాయకులు దారమోని గణేష్ ద్వారా ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, రాష్ట్ర మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ నీ సంప్రదించగా వెంటనే స్పందించి తన ట్రస్ట్ సహాకారంతో సిమెంటు అందజేయడం జరిగింది. ఈ సందర్బంగా వారు ఉప్పల వెంకటేష్ కి ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో, గ్రామ పెద్దలు ఇప్ప సాయిబాబు, దారమోని గణేష్,మాజీ వార్డు సభ్యులు ఖాజా,పెద్దరాజు లక్ష్మమ్మ, రోడ్డ ప్రభాకర్, బాలస్వామి గౌడ్, తుమ్మిశెట్టి రాజు, రామస్వామి, దశరథం,ఆంజనేయులు,ముత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలి ఎమ్మెల్యే




అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)

కల్వకుర్తిలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా కల్వకుర్తి ఎమ్మెల్యే అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అదేవిధంగా జాతీయ రోడ్డు భద్రత అగ్నిమాపక వారోత్సవాలలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి మాట్లాడుతూ హెల్మెట్ సీటు బెల్టు లేకుండా ప్రయాణం చేయకూడదని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన వారోత్సవాల సందర్భంగా ప్రతి ఒక్కరూ నియమ నిబంధనలను పాటించవలసిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు తెలంగాణ ఫైర్ డిజాస్టర్ రెస్పాన్స్ ఎమర్జెన్సీ సివిల్ డిఫెన్స్ డిపార్ట్మెంట్ వారి ఆధ్వర్యంలో అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా మాట్లాడారు ప్రతి ఒక్కరూ అగ్ని ప్రమాదం జరిగినప్పుడు వెంటనే 101 కు సమాచారం అందించాలని అన్నారు అగ్ని ప్రమాదాల నివారణ కోసం సురక్షితమైన పాఠశాల, ఆసుపత్రి మరియు అగ్నిభద్రతపై అవగాహన కలిగిన సమాజం అవసరమని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో, సీఐ నాగార్జున, ఆర్టీవో అశోక్ కుమార్, ఎస్ఐ మాధవరెడ్డి,శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.

## పిఎసిఎస్ ఆధ్వర్యంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రం



**రైతులు సద్వినియోగం చేసుకోవాలి**

**ప్రారంభించిన ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి**

అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)

తలకొండ పల్లి మండలం పడకల్ గ్రామంలో పిఎసిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మొక్కజొన్న, పొద్దు తిరుగుడు,వరి కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి ప్రారంభించారు. రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకొని, మద్దతు ధర పొందాలని, దళారులను నమ్మి మోసపోవద్దని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో క్వింటాల్‌కు మద్దతు ధర లభిస్తుందని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో, పిసిసి సభ్యులు శ్రీనివాస్ గౌడ్,మార్కెట్ కమిటీ చైర్మన్ యాట గీత నరసింహా,వైస్ చైర్మన్ గూడూరు భాస్కర్ రెడ్డి,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు డోకూరి ప్రభాకర్ రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ లు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు సర్పంచ్ కాసు శ్రీనివాస్ రెడ్డి,కాంగ్రెస్ పార్టీ నాయకులు రైతులు పాల్గొన్నారు.

## మార్చాల గ్రామంలో ఘనంగా అంబేద్కర్ 135 వ జయంతి వేడుకలు



**యువత అంబేద్కర్ అడుగు జాడల్లో నడవాలి**

అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)

కల్వకుర్తి మండలంలోని మార్చాల గ్రామంలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న సర్పంచ్ తలసాని కృష్ణరెడ్డి, ఉప సర్పంచ్ నిజాముద్దీన్,పంచాయతీ కార్యదర్శి రమేష్,యువజన సంఘం అధ్యక్షుడు మరియు సభ్యులతో కలిసి విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.అనంతరం వారు మాట్లాడుతూ, అంబేద్కర్ ఆశయాలు ప్రతి ఒక్కరికి ఆదర్శ ప్రాయమని, ఆయన చూపిన మార్గంలో నడవాలని సూచించారు. సామాజిక సమానత్వం, విద్యాభివృద్ధి కోసం ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు.అనంతరం గ్రామంలో అన్నాదానశీ నిర్వహించి పండ్లు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో, విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు వార్డు సభ్యులు,గ్రామ పెద్దలు మాజీ వార్డు సభ్యులు,అన్ని కుల సంఘాల నాయకులు, యువజన సంఘల సభ్యులు, ప్రజలు తదితరులు పాల్గొనడం జరిగింది.

## లింగరావుపల్లి గ్రామంలో ఘనంగా అంబేద్కర్ జయంతి వేడుకలు



**యువత అంబేద్కర్ అడుగు జాడల్లో నడవాలి**

**విగ్రహానికి పూలమాల వేసిన సర్పంచ్ కాసు శ్రీనివాస్ రెడ్డి**

అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)

తలకొండ పల్లి మండలంలోని లింగరావు పల్లి గ్రామంలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహా నికి పూలమాల వేసి నివాళులు అర్పించిన సర్పంచ్ కాసు శ్రీనివాస్ రెడ్డి అనంతరం ఆయన మాట్లాడుతూ, అంబేద్కర్ ఆశయాలు ప్రతి ఒక్కరికి ఆదర్శప్రాయమని, ఆయన చూపిన మార్గంలో నడవాలని సూచించారు. సామాజిక సమానత్వం, విద్యాభివృద్ధి కోసం ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ కాసు శ్రీనివాస్ రెడ్డీ మాజీ సర్పంచ్ జినుకుంట్ల శ్రీనివాస్ గౌడ్ ,ఏల్లమ్మ, తిరుపతయ్య బాల్ రెడ్డి భాస్కర్ రెడ్డి రాములు చెన్నయ్య ప్రమోద్ బక్కి శ్రీను బక్కి శ్రీకాంత్ వాల్లింపుల కుమార్ బండగల్ల శ్రీకాంత్ గ్రామ సిబ్బంది తదితరులు పాల్గొనడం జరిగింది

## పడకల్ గ్రామంలో అంబేద్కర్ 135 వ జయంతి వేడుకలు



**ప్రతి ఒక్కరూ అంబేద్కర్ అడుగు జాడల్లో నడవాలి**

**సర్పంచ్ సునీత ప్రభాకర్ రెడ్డి**

అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)

తలకొండ పల్లి మండలంలోని పడకల్ గ్రామంలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 135 వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ డోకూరి సునీత ప్రభాకర్ రెడ్డి అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.అనంతరం వారు మాట్లాడుతూ, అంబేద్కర్ ఆశయాలు ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయమని, ఆయన చూపిన మార్గంలో నడవాలని సూచించారు. సామాజిక సమానత్వం, విద్యాభివృద్ధి కోసం ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్, వార్డ్ సభ్యులు దళిత సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## వెంకటాపూర్ గ్రామంలో ఘనంగా అంబేద్కర్ 135 వ జయంతి వేడుకలు

అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)

కల్వకుర్తి మండలం లోని వెంకటాపుర్ గ్రామంలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 135 వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.అనంతరం వారు మాట్లాడుతూ, అంబేద్కర్ ఆశయాలు ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయమని, ఆయన చూపిన మార్గంలో నడవాలని సూచించారు. సామాజిక సమానత్వం, విద్యాభివృద్ధి కోసం ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు.ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ నంబు ఇస్తారి, కాంగ్రెస్ పార్టీ నాయకులు అయితపాగా సంతోష్, తదితరులు పాల్గొన్నారు.



# కల్వకుర్తి లో ఘనంగా అంబేద్కర్ 135 వ జయంతి వేడుకలు

**ప్రతి ఒక్కరూ అంబేద్కర్ అడుగు జాడల్లో నడవాలి**

**నివాళులు అర్పించిన ఎమ్మెల్యే కసిరెడ్డి మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్,గోలి శ్రీనివాస్ రెడ్డి**

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**

రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ 135 వ జయంతి వేడుకలను కల్వకుర్తి నియోజక వర్గం వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గ కేంద్రాలతో పాటు మండల కేంద్రాలలో గ్రామీణ ప్రాంతాలలో బాబా సాహెబ్ అంబేద్కర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి వేరు వేరుగా పాల్గొని చిత్రపటాల వద్ద ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రజా ప్రతినిధులు, నాయకులు, కుల సంఘాలు, ప్రజా సంఘాలు, ఉద్యోగ సంఘాల నాయకులతో పాటు ఉన్నతాధికారులు సైతం జయంతి వేడుకల్లో పాల్గొని అంబేద్కర్ కు నివాళులర్పించారు.అనంతరం ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి మాట్లాడుతూ, సమాజంలోని అంటరానితన్నాన్ని



నిర్మూలించేందుకు అంబేద్కర్ చేసిన కృషి మరువలేనిదన్నారు. ఆయన రాజ్యాంగం ద్వారా సమాజంలోని అన్ని వర్గాల వారికి సమన్యాయం చేశారని కొనియాడారు. ఆయన స్ఫూర్తితో ప్రతిఒక్కరూ ముందుకెళ్లాలని సూచించారు. ఆమనగల్ లో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘననివాళులు అర్పించారు.వెల్దశీడ మండల కేంద్రంలో అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ



కార్యక్రమంలో,కాంగ్రెస్ పార్టీ నాయకులు బృంగీ ఆనంద్ కుమార్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గూడూరు భాస్కర్ రెడ్డి,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బెక్కరా బాల్ రెడ్డి,పట్టణ అధ్యక్షుడు పుస్తకాల రాహుల్, కౌన్సిలర్, రాజేష్ కుమార్, షానవాజ్ ఖాన్, గణేష్,ఎజాస్ , రమాకాంత్ రెడ్డి, చెన్నకేశవులు, సర్పంచ్ ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

# నేటి సమాజంలో అంబేద్కర్ స్ఫూర్తితో పోరాటం అవసరం

**ఇందిరమ్మ కాలనీలో ఘనంగా అంబేద్కర్ జయంతి వేడుకలు**

**అగ్నిధార న్యూస్,(రామగుండం):**

దళిత హక్కుల పోరాట యోధుడు, భారత రాజ్యాంగ ప్రధాన రూపశిల్పి డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ స్ఫూర్తితోనే సమాజంలో సమానత్వం సాధ్యమని, రాజ్యాంగ విలువల పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ కట్టుబడి పోరాడాల్సిన అవసరం ఉందని ప్రజాసంఘాల నాయకులు పేర్కొన్నారు. ఎన్టీపీసీ పరిధిలోని ఇందిరమ్మ కాలనీలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ భవన నిర్మాణ స్థలంలో సమతా సైనిక దళ్ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, సమతా ఫౌండేషన్, సమతా గ్రంథాలయ నిర్వాహకులు డాక్టర్ మార్షల్ దుర్గం నగేశ్ ఆధ్వర్యంలో మంగళవారం అంబేద్కర్ 135వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు, సమత సైనిక దళ్ లతో కలసి అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా హాజరైన ఐఎఫ్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు కట్ట విశ్వనాథం మాట్లాడుతూ... అణగారిన వర్గాల సాధికారత కోసం అంబేద్కర్ తన జీవితాన్ని అంకితం చేసిన మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. రాజ్యాంగం ద్వారా మహిళలు, శూద్రులు, పీడిత వర్గాలకు సమాన హక్కులు లభించాయని, వాటిని కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. విద్య ద్వారానే సామాజిక మార్పు సాధ్యమని, యువత అంబేద్కర్ ఆశయాలను ఆచరణలో పెట్టాలని పిలుపునిచ్చారు.

మరో ముఖ్య అతిథి ఏలేశ్వరం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ... మతాల్లో ఉన్న శ్రేష్ఠ భావనలు కొందరి కపట ధోరణుల వల్ల కలుషితమయ్యాయని విమర్శించారు. "సర్వే జనాః సుఖినోభవంతు", "వసుధైవ కుటుంబకం" వంటి ఉన్నతమైన భావనలు ఉన్నప్పటికీ, కుల ఆధిపత్యం, రాజకీయ ఆధిపత్యం కారణంగా సమాజంలో విభజనలు పెరిగాయని, బడుగు బలహీన వర్గాలు అణచివేతకు గురయ్యాయని



పేర్కొన్నారు. అందుకే అంబేద్కర్ మతంలో సంస్కరణలు అవసరమని గట్టిగా డిమాండ్ చేశారని తెలిపారు. మరో ముఖ్య అతిథి రైతు సమస్యల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు ముడిమడుగుల మల్లన్న మాట్లాడుతూ... గతంలో జరిగిన అణచివేతలు నేడు కొత్త రూపంలో కొనసాగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. సమాజంలో అసమానతలను పెంచే ఫాసిస్టు ధోరణులను ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు.

వక్తలు తమ ప్రసంగాల్లో అంబేద్కర్ జీవిత విశేషాలను స్మరించుకున్నారు. 1891 ఏప్రిల్ 14న జన్మించిన ఆయన ఉన్నత విద్యను విదేశాల్లో అభ్యసించి, న్యాయవేత్తగా, ఆర్థికవేత్తగా, సంఘ సంస్కర్తగా విశేష సేవలు అందించారని కొనియాడారు. భారత రాజ్యాంగ రూపకల్పనలో కీలక పాత్ర పోషించి, అణగారిన వర్గాలకు హక్కులు సాధించడంలో అపార కృషి చేశారని గుర్తుచేశారు. 1956లో బౌద్ధమతాన్ని స్వీకరించి సమాజానికి నూతన దిశా నిర్దేశం చేశారని తెలిపారు.

"జీవితం సుదీర్ఘంగా ఉండటం కంటే గొప్పగా ఉండాలి", "మనస్సును పెంపొందించుకోవడం మానవ ఉనికి యొక్క అంతిమ లక్ష్యం" వంటి అంబేద్కర్ సూక్తులు నేటి యువతకు మార్గదర్శకాలని పేర్కొన్నారు. కుల, మత భేదాలు లేని సమసమాజ నిర్మాణమే ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి అని వక్తలు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో న్యూ ఇండియా పార్టీ నాయకులు శంకర్, ప్రజాసంఘాల నేతలు పుట్ట రాజన్న, ఎస్సీ, ఎస్టీ సంఘాల నాయకులు కుమార్, సమతా సైనిక దళ్ నాయకులు చీమల ఆనంద్, జిమ్మిడి అశోక్, శాంతికుమార్, లవన్‌కుమార్, గన్న మహేష్, రామటింకి విశ్వనాథ్, చందనగిరి తిరుపతి, దూట రాజు, దూట సుజాత, జాడి రమేష్, స్థానికులు మోహన్, గురవయ్య బానయ్య, లక్చయ్య, కుమార్, దేవదానం, కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు నాయకపు రాణి, నర్మద, బండి లక్ష్మీ, కుక్క కనకమ్మ, దేవేంద్ర, చందనగిరి లక్ష్మీ, రామటేంకి రాజమ్మ, లక్ష్మి తదితరులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అంబేద్కర్ జయంతి వేడుకలు ఘనంగా నంచర్లలో చలివేంద్రం ప్రారంభం



**అగ్నిదార న్యూస్ మహమ్మదాబాద్: మహమ్మదాబాద్, ఏప్రిల్ 14**

మండలంలోని నంచర్ల గ్రామ పంచాయతీ ఆవరణలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతి వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించబడ్డాయి. మహబూబ్‌నగర్--పరిగి రహదారి పక్కన ఉన్న అంబేద్కర్ విగ్రహానికి సర్పంచ్ సుంకిరెడ్డి గాయత్రి దేవి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కేఎం నారాయణ, టీపీసీసీ నాయకుడు ఈ. రాములు, గండీడ్ ఎంఈఓ ఆర్. జనార్ధన్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని అంబేద్కర్ ఆశయాలను స్మరించుకున్నారు. సమాజంలో సమానత్వం, విద్యా ప్రాముఖ్యతపై ఆయన చూపిన దారిని అనుసరించాలని నేతలు పిలుపునిచ్చారు. అనంతరం ఎండాకాలం తీవ్రతను దృష్టిలో ఉంచుకుని అంబేద్కర్ విగ్రహం సమీపంలో చలివేంద్రం కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కేంద్రం ద్వారా గ్రామ ప్రజలకు శుద్ధమైన తాగునీరు అందించేందుకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి శ్యామ్ సుందర్, మాజీ బిఆర్ఎస్ అధ్యక్షుడు బిక్షపతి, వార్డ్ సభ్యులు చిన్నారెడ్డి, మాధవులు, మాసయ్య, శ్రీనివాస్, గ్రామ పెద్దలు వరుణ్ రెడ్డి, బి. రాజకుమార్, మాజీ డిప్యూటీ సర్పంచ్ పవని వెంకటేష్, అడివయ్య, జోగు అంజి, జి లక్ష్మణ్, సత్యం, రాజు గౌడ్, కె అంజి, బాబు, రాములు, వెంకటయ్య, బుచ్చయ్య,యువజన సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఈనెల 20న కేసీఆర్ చైత్ర యాత్ర సభకు తరలిరండి


**బీఆర్ఎస్ శ్రేణులు, ప్రజలకు మాజీ ఎమ్మెల్యే చందర్ పిలుపు**

**అగ్ని ధార న్యూస్,(రామగుండం):**



ఈనెల 20న జగిత్యాలలో నిర్వహించనున్న కేసీఆర్ చైత్ర యాత్ర భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని రామగుండం మాజీ ఎమ్మెల్యే, పెద్దపల్లి జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు కోరుకంటి చందర్ పిలుపునిచ్చారు.మంగళవారం గోదావరిఖని లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి కేసీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరనున్నారని తెలిపారు.కేసీఆర్ పాలనే ప్రజలకు రక్షణగా నిలిచిందని, మళ్లీ ఆయన ముఖ్యమంత్రిగా రావాలని ప్రజలు కోరుకుంటున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ పాలనపై ప్రజల్లో అసంతృప్తి పెరుగుతోందని ఆరోపించారు.రామగుండం నియోజకవర్గంలోని 60 డివిజన్లతో పాటు అంతర్గాం, పాలకుర్తి మండలాల నుంచి సర్పంచులు, మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద ఎత్తున సభకు తరలిరావాలని కోరారు.రామగుండంలో ప్రస్తుత పరిస్థితులపై కూడా చందర్ విమర్శలు గుప్పించారు. మున్సిపల్ కమిషనర్, తహసీల్దార్ వంటి అధికారులు సక్రమంగా పనిచేయలేకపోతున్నారని, దీంతో అభివృద్ధి పనులు స్తంభించాయని ఆరోపించారు. ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పటికీ పరిష్కారం కనిపించడంలేదన్నారు.ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రామగుండంలో స్తంభించిన పరిపాలన అధికారులు పనిచేయలేకపోతున్నారని విమర్శలు



**అగ్ని ధార న్యూస్,( రామగుండం):**

రామగుండం నియోజకవర్గంలో పాలన స్తంభించిపోయిందని, అధికారులు స్వేచ్ఛగా పనిచేయలేని పరిస్థితులు నెలకొన్నాయని రామగుండం మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ ఆరోపించారు. మంగళవారం గోదావరిఖని ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, నియోజకవర్గంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పటికీ ఎమ్మెల్యే స్పందించడం లేదని విమర్శించారు. చిరు వ్యాపారుల దుకాణాల కూల్చివేతల వల్ల వారు నష్టపోతున్నారని, వారితో చర్చించకుండా చర్యలు తీసుకోవడం సరికాదన్నారు. ఇటీవల జరిగిన సభలో ఎమ్మెల్యే చేసిన వ్యాఖ్యలు ప్రజాస్వామ్యానికి విరుద్ధమని, ప్రజలు, ప్రతిపక్షాలు ప్రశ్నిస్తే బెదిరింపులకు దిగడం తగదన్నారు. ప్రజలే గెలిపించిన ప్రజాప్రతినిధి ఈ విధంగా వ్యవహరించడం సమంజసం కాదని అన్నారు. రామగుండం మున్సిపల్ కార్పొరేషన్‌లో కమిషనర్ లేక రెండు నెలలుగా పనులు నిలిచిపోయాయని, తహసీల్దార్ కార్యాలయంలో సేవలు సక్రమంగా అందడం లేదని, విద్యార్థులు కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గమనించి పరిష్కరించాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులపై ఉందని, రాబోయే రోజుల్లో ప్రజలే తగిన నిర్ణయం తీసుకుంటారని చందర్ పేర్కొన్నారు.

## కులరహిత సమాజం కోసం పోరాడాలి

**: నాయకుల పిలుపు**

**అగ్ని ధార న్యూస్,( రామగుండం ):**

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ 135వ జయంతి సందర్భంగా సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ ప్రజాపంథా ఆధ్వర్యంలో గోదావరిఖనిలో మంగళవారం సభ నిర్వహించారు.ఈ సందర్భంగా అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం జరిగిన సభలో కరీంనగర్ ఉమ్మడి జిల్లా సహాయ కార్యదర్శి గుజ్జుల సత్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ అంబేద్కర్ అట్టడుగు వర్గాల అభ్యున్నతికి జీవితాంతం కృషి చేసిన మహానుభావుడని కొనియాడారు.దేశంలో అసమానతలను తొలగించి సమానత్వం సాధన కోసం పోరాడిన గొప్ప సామాజిక విప్లవకారుడని పేర్కొన్నారు. ప్రస్తుతం పాలక వర్గాలు మనువాద విధానాలతో ప్రజల మధ్య విభేదాలు సృష్టిస్తున్నాయని ఆరోపించారు. రాజ్యాంగ విలువలకు విరుద్ధంగా పాలన సాగుతోందని విమర్శించారు.

ఈ విధానాలకు వ్యతిరేకంగా పోరాడడమే అంబేద్కర్‌కు నిజమైన నివాళి అని పేర్కొంటూ, కులరహిత సమాజం నిర్మాణం కోసం ప్రతి ఒక్కరూ ఆయన ఆశయాల మార్గంలో నడవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ ప్రజాపంథా పెద్దపల్లి డివిజన్ కార్యదర్శి తోకల రమేష్, జిల్లా నాయకులు గొల్లపల్లి చంద్రయ్య, మార్త రాములు, ఇనుగాల రాజేశ్వర్, కలవల రాయమల్లు, ధర్మాజీ నరసయ్య, మోరే రాయమల్లు తదితరులు పాల్గొన్నారు

## ఉచిత వైద్య శిబిరం విజయవంతం



**అగ్నిధార న్యూస్ మహమ్మదాబాద్ :**

మండలం నంచర్ల లో చెన్నారెడ్డి జ్ఞాపకార్థం ఎస్వీఎస్ ఆసుపత్రి సౌజన్యంతో మంగళవారం నంచర్లలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం విజయవంతమైంది. నిష్ణాతులైన వైద్యులు స్త్రీలకు, చిన్నపిల్లలకు, కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచిత మందులు అందించారు. 38 మందిని కంటి ఆపరేషన్ల కోసం ఆసుపత్రికి రిఫర్ చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గాయత్రి దేవి, వార్డ్ నెంబర్స్ చిన్న రెడ్డి, మాధవులు, మైసయ్య, శ్రీనివాస్, డాక్టర్లు గీత, సునీత, సుజన, మేఘన, అర్చన, గ్రామ పెద్దలు, వరుణ్ రెడ్డి,బి రాజు, మాజీ దీప్తి సర్పంచ్ పావని వెంకటేష్, మోహన్ రెడ్డి, బాలవర్ధన్ రెడ్డి, అడివయ్య, జి లక్ష్మణ్, కె అంజి, జోగు అంజి, చారి, సత్యం, జె నవీన్, వెంకటయ్య, రాములు, బుచ్చయ్య, గ్రామస్తులు యువకులు పాల్గొన్నారు.

## ఉజ్జీవన్ ఎస్ఎఫ్‌బీ దరఖాస్తును వెనక్కి పంపిన ఆర్‌బీఐ

ప్రముఖ ఉజ్జీవన్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ (ఎస్ఎఫ్‌బీ) యూనివ ర్సల్ బ్యాంకుగా మారేందుకు ఇచ్చిన దరఖాస్తును భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) వెనక్కి పంపింది. అయితే, ఇది దరఖాస్తును రద్దు చేయడం కాదు, అన్ని రకాల బ్యాంకింగ్ సేవలు అందించే పూర్తి స్థాయి బ్యాంకుగా మారేందుకు అవసరమైన స్థాయిలో సిద్ధంగా లేనందున దరఖాస్తును తిరిగివ్వడం. బ్యాంకు తన లోన్ బుక్‌ను మరింత విస్తరించాల్సిన అవసరం ఉందని ఆర్‌బీఐ పేర్కొంది.

## అంబేద్కర్ జయంతి సందర్భంగా ఘనంగా బైక్ ర్యాలీ



**అగ్నిధార న్యూస్ మహబూబ్ నగర్ జిల్లా గండీడ్ :**

మండలంలో నంచర్ల గేటు నుండి జానంపల్లి గేటు వరకు బైక్ ర్యాలీ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. బైక్ ర్యాలీ కార్యక్రమంలో కప్లాపూర్ మాజీ ఎంపిటిసి ఎం.ఆశన్న, రంగారెడ్డిపల్లి మాజీ ఎంపిటిసి కుందేటి కిష్టన్న,ఉమ్మడి పాలమూరు జిల్లా అంబేద్కర్ సంఘం అధ్యక్షులు పగిడ్యాల్ బోరు కృష్ణయ్య, మండల ఎమ్మార్పీఎస్ అధికార ప్రతినిధి రంగారెడ్డిపల్లి

జె.వివేకానంద్,భీమ్ రాజ్, వేపూరి నర్సింలు, వేణు, శంకరమోల్ల కృష్ణ, శివ కృష్ణ, మల్లేష్, శ్రీకాంత్, గండీడ్ గ్రామ యువకులు, కొండాపూర్ కేశవులు, రాములు ,గంగపురి ఆనంద్, గండీడ్ నరేష్, మల్లేష్, జిన్నారం గణేష్ కృష్ణ ,వివిధ గ్రామాల నుంచి అనేక మంది యువకులు పాల్గొన్నారు.

## ఎల్ఐసీ బోనస్ షేర్ల జారీ

1:1 నిష్పత్తిలో బోనస్ షేర్లను జారీ చేసేందుకు లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఎల్ఐసీ) బోర్డు ఆమోదం తెలిపింది. 2025 డిసెంబరు 31 నాటికి ఎల్ఐసీ వద్ద ఉన్న రూ.6,325 కోట్ల నిల్వలు, మిగులు నిధులతో ఈ బోనస్ ఇష్యూను పూర్తి చేయనున్నట్లు ఎక్స్ఛేంజీలకు ఇచ్చిన సమాచారంలో ఎల్ఐసీ తెలిపింది. రికార్డు తేదీకి (ఇంకా నిర్ణయించలేదు) రూ.10 ముఖవిలువ కలిగిన ఒక్కో ఈక్విటీ షేరు కలిగిన వాటాదార్లకు అదనంగా రూ.10 ముఖవిలువ కలిగిన మరో ఈక్విటీ షేరును బోనస్‌గా జారీ చేస్తారు. ప్రస్తుతం ఎల్ఐసీలో ప్రభుత్వానికి 96.5 శాతం వాటా ఉంది. 2022 మేలో ఐపీఓ ద్వారా 3.5 శాతం వాటాను విక్రయించి దాదాపు రూ.21,000 కోట్లను ప్రభుత్వం సమీకరించింది.

http://www.agnidharanews.com
అగ్నిధార

# మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి

ప్రతిభతో మహిళలు మార్కెటింగ్ లో రాణించాలి..

టాస్క్, వీ హబ్ ద్వారా మహిళలకు ఉపాధి అవకాశాలు..

రాష్ట్ర మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు , ప్రభుత్వ విప్, పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు ..

అగ్నిధారన్యూస్ పెద్దపల్లి





పెద్దపల్లి జిల్లా కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన వీ హబ్ నైపుణ్య శిక్షణ కేంద్రాన్ని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు , రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తో కలిసి మంగళవారం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు ప్రారంభించారు..

**ఈసందర్భంగా ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే విజయరమణ రావు మాట్లాడుతూ...**

మహిళలు స్వయం శక్తితో ఎదిగి పారిశ్రామికవేత్తలుగా రాణించేలా ప్రోత్సహించేందుకు తెలంగాణ ప్రభుత్వం కీలక చర్యలు చేపడుతోందని తెలిపారు. వీ హబ్ మహిళా నైపుణ్య శిక్షణ కేంద్రం ద్వారా స్వయం సహాయక సంఘాల మహిళలు తమ ఆదాయ మార్గాలను మెరుగుపరుచుకొని స్వంత వ్యాపారాలు ప్రారంభించేందుకు అవసరమైన శిక్షణ అందించబడుతుందని తెలిపారు. మహిళలు తయారు చేసే ఉత్పత్తులకు మార్కెట్‌లో గుర్తింపు వచ్చేలా బ్రాండింగ్, ప్యాకేజింగ్, నాణ్యతా ప్రమాణాలపై నిపుణులచే అవగాహన కల్పించబడుతుందని పేర్కొన్నారు. ఉత్పత్తులను సమర్థవంతంగా విక్రయించడానికి అవసరమైన మార్కెటింగ్ నైపుణ్యాలు, పోటీ పరిస్థితులను ఎదుర్కొనే విధానాలపై కూడా శిక్షణ అందించబడుతుందని తెలిపారు. గృహిణులతో పాటు డిగ్రీ, బీటెక్ చదువుతున్న విద్యార్థినులకు సాఫ్ట్ స్కిల్స్, ఉపాధి నైపుణ్యాలపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహించబడతాయని వివరించారు. మహిళలు కేవలం ఉత్పత్తుల తయారీదారులుగానే కాకుండా వాటిని మార్కెట్ చేసే స్థాయికి ఎదగాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని విజయరమణ రావు తెలిపారు. మహిళలను కోటీశ్వరులు చేయాలనేది ప్రభుత్వ సంకల్పం అన్నారు. నాడు 10 ఏళ్ల బీఆర్ఎస్ పాలనలో మహిళా సంఘాల సభ్యులకు కాంగ్రెస్ పాలనలో అమలు చేసిన పావలా వడ్డీ, జీరో వడ్డీ రాయితీ రూ 3100 కోట్లు ఎగ్గొట్టారని మండిపడ్డారు. తిరిగి రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే జీరో వడ్డీ రాయితీ మహిళా సంఘాల ఖాతాల్లో బ్యాంకుల్లో జమ చేశామని గుర్తు చేశారు. ఇందిరా క్రాంతి పథకం ద్వారా మహిళలకు ఉపాధి అవకాశాలను మెరుగుపరిచి ఆర్థికంగా ఎదిగేలా ప్రోత్సహిస్తున్నట్లు చెప్పారు. మహిళలకు ఆర్టీసీ బస్సులు, సోలార్ విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుకు ఆర్థిక చేయూతనిచామని, తద్వారా మహిళలు పారిశ్రామిక వేత్తలు ఎదిగేలా ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తోందన్నారు.

# రామగుండంలో అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్ ఏర్పాటు

: మంత్రి శ్రీధర్ బాబు హామీ

అగ్ని ధార న్యూస్ ,(రామగుండం):





అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా రామగుండం నగరంలో త్వరలోనే అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్ ఏర్పాటు చేస్తామని ఐటీ, పరిశ్రమల శాఖామాత్యులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. రామగుండం నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో మునిసిపల్ టీ జంక్షన్ వద్ద మంగళవారం నిర్వహించిన అంబేద్కర్ జయంతి ఉత్సవాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఐఏఎస్, ఐపీఎస్, గ్రూప్-1, 2, 3, 4 వంటి పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే నిరుపేద అభ్యర్థులు ఢిల్లీ, హైదరాబాద్ వంటి దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా స్థానికంగానే అన్ని సౌకర్యాలతో కూడిన నాలెడ్జ్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తామని తెలిపారు. సామాజిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సహకారంతో ఈ కేంద్రాన్ని త్వరలో అందుబాటులోకి తీసుకురావాలని నిర్ణయించినట్లు చెప్పారు. స్థానిక ఎమ్మెల్యే విజ్ఞప్తి మేరకు నాలెడ్జ్ సెంటర్‌తో పాటు అనువైన స్థలంలో అంబేద్కర్ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి కూడా చర్యలు తీసుకుంటామని, అవసరమైన నిధులను సమకూరుస్తామని వెల్లడించారు. సమాన అవకాశాల కల్పన, సామాజిక న్యాయం సాధన లక్ష్యంగా తమ ప్రభుత్వం పనిచేస్తోందని పేర్కొన్నారు.

రామగుండం నగరంలో దళితవాడల అభివృద్ధి కోసం గత రెండేళ్లలో రూ.14 కోట్లు ఖర్చు చేసినట్లు, బ్యాంక్ లింకేజీ ద్వారా సంక్షేమ కార్యక్రమాలకు మరో రూ.14 కోట్లు వెచ్చించినట్లు తెలిపారు. అర్హులందరికీ పార్టీ తేడా లేకుండా ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తామని స్పష్టం చేశారు.

**ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్:**

రామగుండం శాసనసభ్యులు ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ మాట్లాడుతూ ప్రపంచంలోనే గొప్ప రాజ్యాంగాన్ని భారతదేశానికి అందించిన మహానుభావుడు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ అని కొనియాడారు. ఇప్పటికే 2300 మందికి లబ్ధి చేకూరేలా రూ.15 కోట్ల సబ్సిడీ రుణాలు మంజూరు చేశామని తెలిపారు. మహిళలకు స్వయం ఉపాధి కోసం రూ.30 లక్షల నుంచి రూ.3 కోట్ల వరకు రుణాలు అందించేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. సింగరేణి పరిధిలోని నిరుపయోగ స్థలంలో అంబేద్కర్ పార్క్ అభివృద్ధి చేస్తూ, 20 అడుగుల ఎత్తులో విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో ఖాజిపల్లి వద్ద శాశ్వత భవనంతో నాలెడ్జ్ సెంటర్ నిర్మాణం చేపడతామని పేర్కొన్నారు.

**మేయర్ మహంకాళి స్వామి:**

గతంలో అంబేద్కర్ జయంతిని పరిమితంగా నిర్వహించేవారని, ప్రస్తుతం ఘనంగా నిర్వహిస్తున్నామని మేయర్ మహంకాళి స్వామి అన్నారు. అంబేద్కర్ కేవలం వ్యక్తి కాదు, కోట్లాది ప్రజల ఆశయాలకు ప్రతిరూపమని పేర్కొన్నారు.

**అధికారుల అభిప్రాయాలు:**

అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), కమిషనర్ జె. అరుణ శ్రీ మాట్లాడుతూ మహిళలు స్వయం ఆధారంగా ఎదగడానికి అంబేద్కర్ రాజ్యాంగం ద్వారా అవకాశాలు కల్పించారని తెలిపారు.

**పుస్తకాల పంపిణీ, అవగాహన కార్యక్రమాలు:**

భారత రాజ్యాంగ ముఖ్య లక్షణాలపై రూపొందించిన పుస్తకాన్ని సభికులకు ఉచితంగా పంపిణీ చేశారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో 'అరైవ్-అలైవ్' కార్యక్రమం ద్వారా రహదారి భద్రతపై అవగాహన కల్పించారు. తెలంగాణ కళాజాత బృందం అంబేద్కర్‌పై ఆలపించిన గేయాలు ఆకట్టుకున్నాయి.

ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ పాతపెల్లి ఎల్లయ్య, పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా, సింగరేణి జీఎం లలిత్ కుమార్, పలువురు కార్పొరేటర్లు, అధికారులు, దళిత సంఘాల ప్రతినిధులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రాజ్యాంగంపై అవగాహన అవసరం

అంబేద్కర్ కృషితోనే అణగారిన వర్గాలకు రిజర్వేషన్లు.

ఘనంగా అంబేద్కర్ 135వ జయంతి వేడుకలు.

పెద్దపల్లిన్యూస్ పెద్దపల్లి



భారతరత్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాజ్యాంగంలో అణగారిన వర్గాల ప్రజలకు రిజర్వేషన్లు కల్పించడంతో విద్య, ఉద్యోగాలు, రాజకీయాల్లో ఆయా వర్గాల ప్రజలకు ప్రాధాన్యత కల్పించబడిందని అంబేద్కర్ యువజన సంఘం గ్రామ శాఖ అధ్యక్షుడు పెరక శివశంకర్ అన్నారు.రాజ్యాంగ నిర్మాత, భారతరత్న, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 135 వ జయంతిని పురస్కరించుకొని మంగళవారం కొత్తపల్లిలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పెరక రిబ్కా సంతోష్ హాజరుకాగా జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు అతిథులు,అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ, రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కులు, ఇతర అంశాలు దోహదపడతాయన్నారు. సమాజంలోని అవస్థలు రూపుమాపాలంటే ప్రజల్లో ఉండి పోరాటం చేసేందుకు రాజ్యాంగం కల్పించిన హక్కులు ఉపయోగపడతాయన్నారు. రిజర్వేషన్స్ వలన ఎంతోమంది అణగారిన వర్గాల ప్రజలు ప్రజాప్రతినిధులుగా, ఉన్నతాధికారులుగా ఎదగడం జరిగిందన్నారు. అంబేద్కర్ ఆశయాలను కొనసాగించాలి అన్నారు. భారతరత్న అంబేద్కర్ నిమ్న కులాల ప్రజల అభ్యున్నతికి ఎంతో దూరదృష్టితో రాజ్యాంగంలో వారికి రిజర్వేషన్లు కల్పించడం జరిగిందని, ఆయన తన జీవితాంతం అందరికీ స్వేచ్ఛ, సమానత్వాల కోసం కృషి చేశారన్నారు. రాజ్యాంగంతో భారతదేశం గణతంత్ర, లౌకిక, ప్రజాస్వామ్య దేశంగా రూపొందడమే కాక భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీకగా నిలుస్తోందన్నారు. శాసన, న్యాయ వ్యవస్థలతో పాటు సివిల్ సర్వీసులు, పబ్లిక్ సర్వీస్ కమిషన్లు, ఇతరాత్ర చట్టాల గురించి రాజ్యాంగంలోని వివిధ ఆర్టికల్స్ ద్వారా ప్రస్తావించడం జరిగిందన్నారు.



ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ శ్రీనివాస్ పంచాయతీ కార్యదర్శి సురేందర్ రావు పాలకవర్గ సభ్యులు, అంబేద్కర్ సంఘ నాయకులు పల్లె విజయ్ జోగు రాజయ్య, సదానందం, మదనయ్య, రాజేందర్, సత్తయ్య తో పాటు మెట్టు సమ్మయ్య, ఎలా బోతారం శంకర్, బాలసాని లెనిన్, కుమార్, పల్లె అంజయ్య, అశోక్ , తదితరులు పాల్గొన్నారు.

## అడ్డంగా నరుకుతామన్న ఎమ్మెల్యే వ్యాఖ్యలపై శ్రీధర్ బాబు వివరణ

**హైదరాబాద్ :** రామగుండం ఎమ్మెల్యే మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్ చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా పెద్ద దుమారం రేపాయి. మంథనిలో జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ కార్యకర్తలను ఎవరైనా బెదిరిస్తే "అడ్డంగా నరుకుతాం" అంటూ చేసిన వ్యాఖ్యలపై సోషల్ మీడియాలో తీవ్ర విమర్శలు వచ్చాయి. ఈ నేపథ్యంలో, రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబు ఈ వివాదంపై స్పందిస్తూ వివరణ ఇచ్చారు.రాజ్ ఠాకూర్ శాంతిని కోరుకునే వ్యక్తి అని, ప్రస్తుతం కాంగ్రెస్ కార్యకర్తలను చాలా మంది బెదిరిస్తుండటంతో వారికి ధైర్యం చెప్పే క్రమంలోనే ఆయన ఆవేశంగా మాట్లాడారని మంత్రి సమర్థించారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడిగా కార్యకర్తలు తమ బాధలు చెప్పుకున్నప్పుడు వారిలో భరోసా నింపేందుకు అలా స్పందించాల్సి వచ్చిందని తెలిపారు. శాంతికి విఘాతం కలిగించే ఆలోచనలు ఎవరు చేసినా తమ ప్రభుత్వం ఖండిస్తుందని, చట్టాన్ని అతిక్రమించే ఉద్దేశం ఎవరికీ లేదని మంత్రి స్పష్టం చేశారు.అడ్డంగా నరుకుతామన్న ఎమ్మెల్యే వ్యాఖ్యలపై శ్రీధర్ బాబు వివరణమంథనిలో జరిగిన ఒక సమావేశంలో రాజ్ ఠాకూర్ మాట్లాడుతూ.. "మంథనిలో ప్రతిరోజూ శ్రీధర్ బాబు ఉండకపోవచ్చు. కానీ కార్యకర్తలను ఎవరైనా బెదిరిస్తే మేము 2 గంటల్లో ఇక్కడికి వస్తాం. ఎవరైనా అడ్డంగా మాట్లాడితే వారిని అడ్డంగా నరుకుతాం" అని వ్యాఖ్యానించారు. ఒక బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న వ్యక్తి ఇలాంటి హింసాత్మక వ్యాఖ్యలు చేయడం సరికాదంటూ విపక్షాలు మండిపడుతున్నాయి.

## నేటి తరానికి స్ఫూర్తి దాయకం అంబేద్కర్ జీవితం



**మొగుళ్ళపల్లి :** మండల కేంద్రంలో అంబేద్కర్ యువజన సంఘం గ్రామ శాఖ ఆధ్వర్యంలో భారత రాజ్యాంగ రచయిత ప్రపంచ మేధావి డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సిఐ మల్లేష్ యాదవ్, ఎస్ఐ ఎం సురేష్ మాట్లాడుతూ దేశ ప్రజల జీవితాల్లో వెలుగు నింపి దేశ చరిత్రను తిరగరాసిన మహోన్నత వ్యక్తి సంఘసంస్కర్త అంటరాని తనం అస్పృశ్యత కుల వివక్ష నిర్మూలన కోసం అలుపెరగని పోరాటం చేసిన మహనీయుడు భారత రాజ్యాంగ రచయిత ప్రపంచ మేధావి డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ అని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చాట్ల విజయ- రవీందర్ చిట్యాల మార్కెట్ వైస్ చైర్మన్ రఫీ, పిఎసిఎస్ చైర్మన్ మాజీ సంపెల్లి నరసింగరావు, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు తక్కలపల్లి రాజు, భారతీయ జనతా పార్టీ భూపాలపల్లి నియోజకవర్గ ఇన్చార్జి మోరే రవీందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి నడిగోటి రాము, దళిత రత్న దబ్బేటి రమేష్, అంబేద్కర్ యువజన సంఘం జిల్లా నాయకులు మంద సాంబయ్య, హర్షం అశోక్, ఎంపీ ఓ చంద్ర బోస్, పంచాయతీ కార్యదర్శి నరేష్, మాజీ సర్పంచ్ ధర్మారావు, బండారి ప్రవీణ్ కుమార్ ఎంపీడీవో,అంబేద్కర్ యువజన సంఘం జిల్లా నాయకులు బండారి రాజు, బండారి రామస్వామి బండారి విజయ్ కుమార్, బండారి రవీందర్,,మండల నాయకులు మండల అధికారులు అంబేద్కర్ యువజన సంఘం, గుడిమల్ల రమేష్, దొమ్మేటి రవి, హర్ష మహేష్, వార్డు నెంబర్, శనిగరపు శ్రీనివాస్ మాజీ వార్డు నెంబర్, బండారి శంకర్, బండారి కుమార్ ( ధోని) బండారి సదా రాజు, బండారి సదయ్య, బండారి, సామి సార్, శనిగరపు రవికుమార్, బండారి రమేష్,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

## ఇల్లంతకుంట ఉప మండల హిందూ సమ్మేళన వాల్ పోస్టర్ ఆవిష్కరణ

**రాజన్న సిరిసిల్ల :** ఇల్లంతకుంట మండల కేంద్రంలోని స్థానిక వాణినికేతన్ హైస్కూల్లో ఆవరణలో ఇల్లంతకుంట ఉప మండల హిందూ సమ్మేళన నిర్వహణ సమితి అధ్యక్షులు తూముకుంట మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో హిందూ సమ్మేళన గోడపత్రిక , కరపత్రం ఆవిష్కరణ చేశారు.ఈ సందర్భంగా తూముకుంట మోహన్ రెడ్డి మాట్లాడుతూ అసంఘటితంగా ఉన్న హిందూ సమాజాన్ని ఏకత్రాటిపై సంఘటిత పరచాలని ఉద్దేశంతోనే హిందూ సమ్మేళన బహిరంగ సభను నిర్వహిస్తున్నామని తెలిపారు.ఈ నెల 21 తేదీ న మంగళ వారం రోజున సాయంత్రం 5 గంటలకు గంగాధర క్షేత్రం ప్రక్కన ఉన్న స్థలం లో సమ్మేళనం జరుగుతుందని తెలియజేశారు.ఈ సమ్మేళనానికి హిందూ బంధువులు అత్యధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయవలసిందిగా పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో ఖండ జాగరణ సమితి సభ్యులు బత్తిని ఆంజనేయులు, కాసుపాక కిషన్, ఎగుర్ల శ్రీనివాస్, హిందూ సమ్మేళన నిర్వహణ సమితి ప్రధాన కార్యదర్శి ఈదుల రవీందర్ రెడ్డి, కోశాధికారి నార్ల రామ్ కిషన్, అనంతారం గ్రామ సర్పంచ్ వోల్లాల రజిత వెంకటేశం,హిందూ సమ్మేళన నిర్వహణ సమితి సభ్యులు డాక్టర్ జగన్ మోహన్ రావు , వీరారెడ్డి , బొల్లం ధనుంజయ్, మాజీ సర్పంచ్ కునబోయిన బాలరాజు, పర్స అయిలయ్య, అక్కెం నాగరాజు,బత్తిని స్వామి,పండుగ వెంకటి,అన్నాడి నవీన్ రెడ్డి,సార శశికాంత్,సింగరి శ్రీనివాస్,నారెడ్డి కిషోర్,నార్ల దినేష్,మొగిల్లా బాబు,కుమ్మరివేణి సత్యనారాయణ, సింగరి, శ్రీనివాస్, తిప్పారపు రామకృష్ణ, శిరవేణి అంజి, సార రాజు, కోమిటిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, సార శంకర్, సిరవేణి నర్సయ్య, ఇట్టిరెడ్డి లక్ష్మారెడ్డి . తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 135వ, జయంతి వేడుకలు.




**హుస్నాబాద్ :** సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండల కేంద్రంలో బీజేపీ పార్టీ అధ్యక్షుడు రామంచ మహేందర్ రెడ్డి అధ్యక్షతన డాక్టర్ భారతరత్న బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతి పురస్కరిం చుకొని వారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో అక్కనపేట మండల అధ్యక్షులు మహేందర్ రెడ్డి మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాతగా, అట్టడుగు వర్గాల ఆశాజ్యోతిగా దేశ గమనాన్ని మార్చిన అంబేద్కర్ విజ్ఞానానికి, పోరాటానికి నిలువెత్తు రూపంఅని అన్నారు.సమాజంలోని అసమానతలను రూపుమాపి, ప్రతి ఒక్కరికీ సమాన హక్కులు కల్పించేందుకు ఆయన చేసిన కృషి చిరస్మరణీయని, అంబేద్కర్ ఆశయాలను గౌరవిస్తూ, అట్టడుగు వర్గాలకు అభివృద్ధి ఫలాలను అందిస్తూ నవ భారత నిర్మాణానికి నరేంద్ర మోదీ ప్రభుత్వం అంకిత భావంతో పని చేస్తోందన్నారు.ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు జిల్లా కౌన్సిల్ మెంబర్ కర్ణకంటి నరేష్ మండల ప్రధాన కార్యదర్శులు చెరుకు సంపత్ మడక రవికుమార్ చౌడు తండా ఉపసర్పంచ్ అర్జున్ నాయక్ బిజెపి సీనియర్ నాయకులు మోహన్ నాయక్ జంగపల్లి శ్రీనివాస్ చందుపట్ల నాగరాజు. తీగుల చంద్రం కొండ్ల సంజీవరెడ్డి జన్నారపు కళ్యాణ్. బత్తిని జీవన్, గిరిమల్ల రాజు,ఇటీకాల రాజశేఖర్, వేముల శ్రీనివాస్,రాజు,తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.



## మండుటెండలో చెప్పుల్లేకుండా షూటింగ్.. ‘తెరచాప’ హిట్ కావాలి

నవీన్ రాజ్ శంకరప్పు, పూజ సుహాసిని, శ్రీలు ముఖ్యపాత్రలో నటించిన తాజా చిత్రం ‘తెరచాప’. అనన్య క్రియేషన్స్ బ్యానర్ పై కైలాష్ దుర్గం నిర్మిస్తున్న ఈ చిత్రానికి జోయల్ జార్జ్ దర్శకత్వం వహిస్తున్నాడు. రాజీవ్ కనకాల, పృథ్వీరాజ్, జగదీష్ ప్రతాప్ బండారి, జబర్దస్త్ అశోక్, నాగి కీలకపాత్రలు పోషించారు. ఏప్రిల్ 17న ఈ చిత్రం విడుదల కాబోతుంది. ఈ నేపథ్యంగా తాజాగా ఈ మూవీ ప్రీరిలీజ్ ఈవెంట్‌ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాజీ కనకాల మాట్లాడుతూ..ఈ సినిమాలో నాతోపాటు ఎందరో సీనియర్ నటులు నటించారు. అలాగే కొత్త వారు కూడా నటించారు. మండుటెండలో సముద్ర తీరాన ఇసుకలో చెప్పులు లేకుండా నటించడం అనేది ఎంతో కష్టమైన పరిస్థితి. అటువంటి పరిస్థితులలో కూడా నవీన్ రాజ్ చాలా కష్టపడి నటించారు. శారీరకంగానే కాకుండా మానసిక ఒత్తిళ్లు ఎన్ని ఉన్నా కూడా ఆయన వాటిని ఎదిరించి నిలబడ్డారు. అంత కష్టపడి నటించినా ఈ సినిమాను తన తండ్రికి అంకితం చేస్తున్నాను అని నాతో అన్నప్పుడు నేను ఎంతో ఆనందపడ్డాను.ఈ సినిమా ఘన విజయం సాధించాలని కోరుకుంటున్నాను’ అన్నారు. దర్శకుడు సముద్ర మాట్లాడుతూ... “సముద్రతీతంగా అటువంటి పరిస్థితులలో ఒక సినిమా తీయడం అనేది ఎంతో కష్టమైన విషయం. అటువంటి సినిమాను ఈ చిత్రం బృందం అంతా కలిసి ఎంతో పట్టుదలతో పూర్తి చేసి ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. అందరూ వీరిని ఆశీర్వదించవలసిందిగా కోరుకుంటున్నాను” అన్నారు. ‘సినిమా కోసం మేము సముద్ర తీరాన ఎన్నో రోజులు ఎంతో కష్టపడి అక్కడ బ్రతికే మత్స్యకారుల జీవితాలను అర్థం చేసుకొని వారిలో ఒకరిగా కలిసిపోయి చిత్రీకరించాం. ఎంతోమంది ఎన్నో కలలు కని సినిమా తీసినట్లే మేము కూడా చేశాం. మా సినిమాను ప్రేక్షకులు అంతా ఆదరించి మంచి విజయం సాధించేందుకు తోడ్పడుతారని కోరుకుంటున్నాను’ అని హీరో నవీన్‌రాజ్ శంకరాపు అన్నారు.

## రాకా.. ఆ నలుగురితో కేక




పుష్ప సినిమాతో అల్లు అర్జున్ పాన్ ఇండియా స్టార్ అయ్యాడు. ఇప్పుడు ఆయన?కు తెలుగులోనే కాదు దేశ వ్యాప్తంగా అభిమానులు ఉన్నారు. వారందరిని మెప్పించే కథలపైనే బన్నీ ఫోకస్ పెట్టాడు. అందులో ఒకటి రాకా. అల్లు అర్జున్ – – అట్లీ కాంబోలో రూపుదిద్దుకొంటున్న తొలి సినిమా ఇది. రూ. 900 కోట్ల భారీ బడ్జెట్‌తో పాన్ ఇండియా స్థాయిలో ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. షూటింగ్ మొదలైనప్పటి నుంచే ఈ సినిమాపై భారీ అంచనాలు ఏర్పడ్డాయి. ఇక బన్నీ బర్త్‌డే సందర్భంగా విడుదలైన ఫస్ట్ లుక్, టైటిల్ రివీల్ ఆ అంచనాలను మరింత పెంచేశాయి. ఇందులో బన్నీ హీరోగా, విలన్‌గా ద్విపాత్రాభినయం చేస్తున్నాడు. ఇప్పుడు బయటకు వచ్చిన లుక్ విలన్‌ది. హీరో పాత్రకు సంబంధించిన లుక్ చాలా స్టైలీష్‌గా ఉంటుందట. ఇదిలా ఉంటే.. ఇప్పుడు ఈ చిత్రానికి సంబంధించిన మరో ఆసక్తికరమైన విషయం బయటకు వచ్చింది. ఈ సినిమాలు మొత్తం నలుగురు హీరోయిన్లు ఉంటారు. ఇప్పటికే ఒక హీరోయిన్‌గా దీపికా పదుకొణె పేరు బయటకు వచ్చింది.

మరో ముగ్గురు హీరోయిన్లలో రష్మిక, మృణాల్, జాన్వీ కపూర్ పేర్లు బలంగా వినిపిస్తున్నాయి. వీరిలో రష్మిక అల్రేడీ బన్నీతో కలిసి పుష్ప, పుష్ప 2 చిత్రాల్లో నటించింది. మృణాల్, జాన్వీలు తొలిసారి బన్నీతో స్క్రీన్ చేసుకుంటున్నారు. ఇలా ఒకే సినిమాలో నలుగురు హీరోయిన్లతో కలిసి నటించడం బన్నీ కెరీర్‌లోనే తొలిసారి. కథ డిమాండ్ మేరకే నలుగురిని తీసుకున్నారట. అంతేకాదు ఈ నలుగురి పాత్రలు కూడా సినిమాలో కీలకం అట. ఒకవైపు కావాల్సినంత గ్లామర్‌ని చూపిస్తూనే.. మరోవైపు కథలో కీలకంగా వ్యవహరించేలా వీరి పాత్రలను తీర్చిదిద్దినట్లు సమాచారం. ఈ నలుగురూ బన్నీతో ఒకే ఫ్రేమ్ లో కనిపిస్తే మాత్రం ఫ్యాన్స్ పండగ చేసుకోవడం ఖాయం.

## అనుకున్న తేదీకే ‘టాక్సిక్’.. పుకార్లను నమ్మవద్దన్న మేకర్స్



కన్నడ స్టార్ నటుడు యశ్ కథానాయకుడిగా గీతూ మోహన్ దాస్ దర్శకత్వంలో రూపొందుతున్న భారీ బడ్జెట్ చిత్రం ‘టాక్సిక్’. ఈ సినిమా విడుదల వాయిదా పడిందంటూ గత కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో జోరుగా ప్రచారం సాగుతోంది. అయితే ఈ వార్తలపై చిత్ర బృందం తాజాగా స్పందిస్తూ క్లారిటీనిచ్చింది. ఈ సినిమాను అనుకున్న తేదీ ప్రకారమే జూన్ 4 వరల్డ్ వైడ్‌గా విడుదల చేయబోతున్నట్లు చిత్రబృందం తెలిపింది. తొలుత ఈ చిత్రాన్ని 2025 ఏప్రిల్‌లో విడుదల చేయాలని భావించినప్పటికీ ఇరాన్ – అమెరికా వార్ నేపథ్యంలో వాయిదా వేసుకుంది. ప్రస్తుతం యశ్ ఈ సినిమా ప్రమోషన్ల కోసం అమెరికాలోని లాస్ వెగాస్‌లో జరుగుతున్న ప్రతిష్టాత్మక ‘సినీమాకాన్’ వేడుకలో పాల్గొంటున్నారు. దీనిని కేవలం పాన్–ఇండియా స్థాయిలోనే కాకుండా గ్లోబల్ మార్కెట్‌లోనూ భారీగా విడుదల చేసేందుకు టీమ్ ప్లాన్ చేస్తోంది. 1940 నుండి 1970 మధ్య కాలంలో గోవా గ్యాంగ్‌స్టర్ నేపథ్యంలో సాగే ఈ యాక్షన్ డ్రామాలో నయనతార, కియారా అద్వానీ, హ్యూమా ఖురేషీ వంటి అగ్ర తారలు నటిస్తున్నారు.

## ‘డ్రాగన్’ కోసం ఆలియా?.. ప్రశాంత్ నీల్ సినిమాలో బాలీవుడ్ బ్యూటీ!



జూనియర్ ఎన్టీఆర్, దర్శకుడు ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో రాబోతున్న సినిమాపై భారీ అంచనాలు నెలకొన్న విషయం తెలిసిందే. ప్రస్తుతానికి ‘డ్రాగన్’ అనే వర్కింగ్ టైటిల్‌తో రాబోతున్న ఈ సినిమాలో బాలీవుడ్ స్టార్ హీరోయిన్ ఆలియా భట్ ఒక శక్తివంతమైన కీలక పాత్రలో నటించబోతున్నట్లు సమాచారం. గతంలో రాజమౌళి తెరకెక్కించిన ‘===’ చిత్రంలో తారక్, ఆలియా కలిసి నటించి మెప్పించగా, మరోసారి ఈ జంట వెండితెరపై కనిపించబోతుండటం అభిమానుల్లో ఉత్సాహాన్ని నింపుతోంది. ఈ సినిమాలో ఆలియా భట్ కేవలం గ్లామర్ పాత్రకే పరిమితం కాకుండా, కథను మలుపు తిప్పే ప్రాధాన్యత ఉన్న పాత్రలో కనిపిస్తారని సమాచారం. ఇప్పటికే కన్నడ నటి రుక్మిణి వసంత్ ఈ చిత్రంలో కథానాయికగా ఎంపికైనట్లు ప్రచారం జరుగుతుండగా, ఆలియా కూడా చేరితే సినిమాలో ఇద్దరు హీరోయిన్లు ఉండే అవకాశం ఉంది. దర్శకుడు ప్రశాంత్ నీల్ ఇప్పటికే ఆలియాను సంప్రదించారని, దానికి ఆమె సానుకూలంగా స్పందించారని టాక్ నడుస్తోంది, అయితే దీనిపై చిత్ర యూనిట్ నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ సినిమా కోసం ఎన్టీఆర్ ప్రత్యేకంగా ‘కలరిపయట్టు’ వంటి మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ పొందుతున్నారు. ప్రశాంత్ నీల్ మార్క్ హై–వోల్టేజ్ యాక్షన్‌కు ఆలియా వంటి టాలెంటెడ్ నటి తోడైతే, ఈ పాన్–ఇండియా చిత్రం బాక్సాఫీస్ వద్ద సరికొత్త రికార్డులు సృష్టించడం ఖాయమని విశ్లేషకులు భావిస్తున్నారు.

## ‘డెకాయిట్’ మూవీపై రామ్ చరణ్ ప్రశంసల జల్లు.. అడివి శేష్ నటన అద్భుతమంటూ ట్వీట్!




అడివి శేష్, మృణాల్ ఠాకూర్ ప్రధాన పాత్రల్లో నటించిన మోస్ట్ అవేటెడ్ మూవీ ‘డెకాయిట్’ పై మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ ప్రశంసల జల్లు కురిపించారు. తాజాగా ఈ సినిమాను వీక్షించిన ఆయన, సోషల్ మీడియా వేదికగా తన రివ్యూను పంచుకుంటూ చిత్ర బృందాన్ని అభినందించారు. హరి పాత్రలో అడివి శేష్ అద్భుతమైన నటనను కనబరిచారని, ఆయన పెర్ఫార్మెన్స్ ప్రేక్షకుల మదిలో చిరస్థాయిగా నిలిచిపోతుందని చరణ్ కొనియాడారు. అలాగే మృణాల్ ఠాకూర్ తన నటనతో పాత్రకు ప్రాణం పోశారని, ఈ సినిమాలో ఆమె నటన ఎంతో లోతుగా ఉందంటూ మెచ్చుకున్నారు. బాలీవుడ్ దిగ్గజ దర్శకుడు అనురాగ్ కశ్యప్‌తో పాటు ఇతర నటీనటులందరూ తమ ప్రదర్శనతో సినిమాను మరో స్థాయికి తీసుకెళ్లారని ఆయన పేర్కొన్నారు. ముఖ్యంగా అన్నపూర్ణ స్టూడియోస్ బ్యానర్‌పై సుప్రియ యార్లగడ్డ ఈ చిత్రాన్ని అత్యున్నత సాంకేతిక ప్రమాణాలతో, రాజీ పడకుండా నిర్మించిన తీరును చరణ్ ప్రత్యేకంగా అభినందించారు. సాంకేతికంగా సినిమా ఎంతో రిచ్‌గా ఉందని, టీమ్ మొత్తం పడ్డ కష్టానికి తగిన ఫలితం దక్కిందని ఆయన తెలిపారు. రామ్ చరణ్ స్వయంగా సినిమాను మెచ్చుకుంటూ పోస్ట్ చేయడంతో ‘డెకాయిట్’ పై ప్రేక్షకుల్లో అంచనాలు రెట్టింపయ్యాయి. వరుస విజయాలతో దూసుకుపోతున్న అడివి శేష్ ఖాతాలో ఈ చిత్రం మరో భారీ విజయంగా నిలుస్తుందని ఇండస్ట్రీ వర్గాలు భావిస్తున్నాయి. ప్రస్తుతం ఈ మెగా ప్రశంసలు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారాయి.

Printed Published Edited and Owned by Chegonda Ravikumar Yadav.Printed at Sri Laxmi Printing Press H.NO.4_6_157 Peddapalli Pin co.505172 State Telangana
TITLE CODE:TELTEL02040 EDITOR: Chegonda Ravikumar Yadav Contact Number.8008817828. Email.agnidharanews@gmail.com http://www.agnidharanews.com